కొత్తపల్లి

పిల్లల కథల పుస్తకం



61

కొత్తపల్లి పిల్లల కథల పుస్తకం-61 జూన్ 2013

మూలం: http://kottapalli.in/2013/06/welcome

మొత్తం ప్రతుల సంఖ్య: 2000

సంపాదకులు: నారాయణ

ముఖచిత్రం 'భూమి మండుతోంది': వీరాంజనేయులు

అక్షర కూర్పు: *కొత్తపల్లి*


వెల:రూ.25/-

ఇంటర్నెట్‌లో ఈ పుస్తకాన్ని వివిధ ఫార్మాటుల్లో ఉచితంగా చదవవచ్చు, డౌన్లోడు చేసుకోవచ్చు, అవసరమనిపిస్తే మీ వాణిజ్యేతర కార్యక్రమాలకోసం మీ అంతట మీరే దీన్ని ముద్రించుకోవచ్చు!

కొత్తపల్లి ప్రచురణలు

యంఆర్‌వో ఆఫీసు దగ్గర, చెన్నేకొత్తపల్లి- 515 101, అనంతపురం జిల్లా.

ఫోను: 08559 240222, 7702877670 ఇ-మెయిలు: team@kottapalli.in



విషయ సూచిక

పిసినారులు !

ప్రపంచంలో పెట్రోలు నిల్వలు తగ్గిపోతున్నాయి; దాంతో అమెరికా వారు తమ సొంత సముద్ర తీరంలోనే పెట్రోలుత్రవ్వితీద్దామని ఆలోచిస్తున్నారట. ఈ సంగతి తెలిసాక ఓ కథ గుర్తొచ్చింది..

ఓ రోజున తమ ఇంట్లో క్యాలండర్ తగిలించుకుందామనుకున్నాడట, నసీరుద్దీన్.

అయితే ఎంత చూసినా క్యాలండర్‌కు అనువైన స్థలం దొరకలేదు.

మంచి గోడ ఉన్న చోట మేకు లేదు. మేకు ఉన్న చోటు క్యాలండర్ తగిలించేందుకు వీలుగా లేదు.

చివరికి విసుగొచ్చింది. గోడకు కొత్తగా మేకు కొట్టాల్సిందేననుకున్నాడు.

మేకు పట్టుకొని స్టూలు మీదెక్కి నిలబడ్డాడు.

చూడగా చేతిలో మేకును కొట్టేందుకు సుత్తి లేదు.

"ఒరే, చిన్నోడా! ఇటు రా రా, ఓసారి" పిలిచాడు కొడుకుని.

చిన్నోడు వచ్చాడు-

"పక్కింటికి వెళ్ళి సుత్తి అడిగి తీసుకురా, చిన్నా" చెప్పాడు నసిరుద్దీన్.

చిన్నోడు పరుగెత్తుకుంటూ పక్క వాళ్ళింటికి వెళ్ళి, ఖాళీ చేతుల్తో తిరిగొచ్చాడు -"వాళ్ళు అడిగారు- 'చెక్క మేకా, ఇనప మేకా?' అని. 'ఇనప మేకే' అని చెప్పాను. 'అయితే మేం ఇవ్వం. మా సుత్తి పాడైపోతుంది' అన్నారు వాళ్ళు" చెప్పాడు.

"పిసినిగొట్టులు! వాళ్ళని అడిగీ ప్రయోజనం ఉండదని అనుకుంటూనే ఉన్నాను. వాళ్ల సుత్తి మనకెందుకు? లోకంలో సుత్తులు కరువా? ఇటు ప్రక్క వాళ్ళు మంచివాళ్ళు. వాళ్ళనడిగి సుత్తి తీసుకురా నాయనా" అన్నాడు నసీరుద్దీన్.

పిల్లవాడు అయిష్టంగానే ఇటువైపు వాళ్ళింటికి వెళ్ళి వచ్చాడు, చేతులూపుకుంటూ.

"వాళ్ళింట్లో సుత్తి లేదట" అన్నాడు.

నసీరుద్దీన్‌కి కోపం వచ్చింది- "ఎందుకు లేదు? నాలుగు రోజుల క్రితం వాళ్ళింట్లో సుత్తిని నా కళ్ళారా చూశాను! ఏవో లెక్కలు వేసుకుంటున్నారల్లే ఉంది- పట్టించుకోకు. మన పని జరగటం ముఖ్యం- రెండిళ్ళ అవతల సుల్తాన్ వాళ్ళింట్లో మంచి సుత్తి ఉంది. అడిగి పట్టుకురా" అన్నాడు.

అయితే సుల్తాన్ వాళ్ళూ సుత్తిని ఇవ్వలేదు. "వాళ్ల సుత్తి హ్యాండిల్ విరిగిపోతున్నదట. ఇవ్వమన్నారు" ఉత్త చేతుల్తో తిరిగొచ్చాడు కొడుకు.

"వాళ్ళు ఇవ్వకపోతే ఏమిరా, అబ్బాస్ మామ ఇస్తాడు మనకు! పోయిరా" అబ్బాస్ మామ ఇంటికి పంపాడు కొడుకుని.


అబ్బాస్ వాళ్ళూ సుత్తిని ఇవ్వలేదు. నసీరుద్దీన్ కొడుకు అట్లా ఓ పది ఇళ్ళు చుట్టుకొని వచ్చాడు. ఎవ్వరూ సుత్తిని ఇవ్వలేదు. మేకు పట్టుకొని, స్టూలు ఎక్కి నిల్చొనీ నిల్చొనీ నసీరుద్దీన్‌కు కాళ్ళు నొప్పి పుట్టటం మొదలెట్టాయి.

"పిసినారులు! పిసినారుల ఊరు! ఈ ఊరంతా పిసినిగొట్టులే ఉన్నట్లున్నారు. దీన్ని వదిలేసి వేరే ఊరికి పోతే తప్ప లాభం లేదు! పనికి మాలిన ఊరు, పనికి మాలిన పొరుగువాళ్ళు! ఇంకేం చేస్తాం?! పోరా, చిన్నా, ఇంట్లోకి వెళ్ళి, మన సుత్తే పట్టుకురా పో! పిసినిగొట్టుల ఊర్లో ఇంక వేరే ఏమీ చెయ్యలేం మనం!" మనసారా తిట్టాడు ఉన్న ఊరి జనాలని.

నసీరుద్దీన్ ఏనాడో కొని భద్రంగా దాచిన సుత్తి, ఆ విధంగా '-ఊళ్ళోవాళ్ల పిసినారి తనం కారణంగా ' పనిలోకి వచ్చిందట!

అందరికీ నమస్కారాలతో,

కొత్తపల్లి బృందం.



నీతి చంద్రిక

విగ్రహం-18

జరిగిన కథ: హంసరాజుకు, నెమలి రాజుకు మధ్య యుద్ధం మొదలవుతున్నది. నెమలి రాజు పంపిన గూఢచారి కాకి వచ్చి హంస కొలువులో కుదురుకున్నది. దాన్ని దూరం ఉంచమని చెబుతూ మంత్రి గుడ్లగూబలు-కాకుల కథ మొదలు పెట్టింది. గుడ్లగూబలు కాకుల నివాసంపై దాడి చేసి వాటి జీవితాన్ని నాశనం చేశాయి. కాకుల వృద్ధ మంత్రి 'చిరంజీవి' తెలివిగా గుడ్లగూబల రాజుకు దగ్గరయింది. ఆ తర్వాత ఏం జరిగిందో చదవండి- నీతి చంద్రిక 42 వ భాగం...

ఇక ఆ తర్వాత అది ఆ గుడ్లగూబల రాజుతో ఇష్టంగా ముచ్చట్లు పెట్టుకుంటూ, నిముషం కూడా ఆ రాజును విడచిపెట్టక అతని సమ్ముఖంలోనే నిలబడి ఉండటం మొదలు పెట్టింది.

రాజు చూపులు ఎక్కడ వాలతాయా అన్నట్లు రెప్పలార్పకుండా రాజువైపే చూస్తూ అతి విశ్వాసపాత్రంగా గడిపింది. ప్రతిరోజూ వింతవింతగా నవరసభరితమైన వినోదాలతో రాజుకు సంతోషం కలిగించింది.

అంతకంతకూ మొదటికంటే నూరు రెట్ల విధేయతలను కురిపిస్తూ, అనేక రకాల పరిచర్యలతో ఉపమన్యుడి మనసుకు నచ్చే విధంగా ప్రవర్తించింది. చాలా నమ్మకం కలిగించుకొని, అన్నిచోట్లా ఎలాంటి అడ్డూ లేకుండా తిరిగింది.



ఆ కోటతో బాగా పరిచయం పెంచుకున్నది. అందులో రహస్యంగా తిరిగేందుకు, తప్పించుకునేందుకు ఉన్న మార్గాలనూ, కోట బలాబలాలను పూర్తిగా ఆకళించుకున్నది.

ఆ తర్వాత ఒకనాటి పగటిపూట, గుడ్లగూబలన్నీ ఆదమరచి సుఖంగా నిద్రపోతున్న సమయంలో అది గుహ బయటికి వచ్చి, దగ్గరలో ఆవుల గుంపులు ఉండే తావుకు వెళ్ళి, ఎండు గడ్డి గాదాలను కాలి వ్రేళ్ల సందుల్లో ఇరికించుకొని వచ్చి గుహద్వారం ముందు కుప్పలు చేసి పెట్టింది. వెంటనే చప్పుడు చేయకుండా కాకి రాజు మేఘవర్ణుడు వలస వెళ్ళిన కొండకు ఎగిరి వెళ్ళింది.

ఆ రాజుకు నమస్కరించి "ప్రభూ! మనం పట్టిన పంతం నెగ్గే సమయం దగ్గర పడింది. తమరు నాపై పెట్టిన విశ్వాసపు రుణం తీర్చుకునే అవకాశం ఇవాళ్ల వచ్చింది. తమరి మనోరథాన్ని తీర్చేందుకు నేను పడ్డ శ్రమ అంతా నేడు ఫలించనున్నది. మీరంతా ఏక నిశ్చయులై నాకు చేదోడుగా తరలి రావాలి.

నేను ఆ ఉపమన్యుడి స్నేహం సంపాదించేందుకుగాను పడరాని పాట్లు ఎన్ని పడ్డానో, ఏమని చెప్పమంటారు? అయ్యో! ఉపమర్దనుడి పాపం పండింది కాబట్టి అంత సులభంగా నేను వేసిన వలలో తగులుకున్నాడు; నాకు తినేందుకు అన్నం, త్రాగేందుకు నీళ్ళు కల్పించాడు; నా

బాగోగులు చూసుకోవటంకోసం పరిచారకులను నియమించాడు.



ఆ పరిచారకులంతా మొదట్లో నేను కనబడితే చాలు- గుటుక్కుమనకుండా మ్రింగాలని ప్రయత్నించేవాళ్ళు. అప్పుడంతా వాళ్ళు పెట్టే కష్టాలను భరిస్తూ, వాళ్ళు 'ఇదిగో తిను' అని ఏదో ఇస్తే ఆ ఇచ్చినదాన్నే తింటూ, నోరు కట్టుకొని, శరీరం శుష్కించిపోయినా ఓర్చుకొని, అదీ దొరకనినాడు ఊరికే నీళ్ళు త్రాగి కడుపు నింపుకున్నాను- తగిన సమయంకోసం ఎదురుచూస్తూ వచ్చాను. ఆ విధంగా చివరికి వాళ్ళందరి ఆదరాన్ని కూడా సంపాదించుకున్నాను. తలపెట్టిన పని నెరవేరనున్నది, మనం పడ్డ శ్రమ ఇప్పుడు గుర్తుకు రాదసలు.

యముడి చేతిలో ఉన్న పాశాలు తగులుకున్నాయి, ఉపమర్దనుడికి. ఇప్పుడు అతను రాజ్యాన్ని పరిపాలించటం మరచాడు- 'నా తోడిదే లోకం' అన్నట్లు, ఏమారి ఉన్నాడు. నాతో స్నేహం చేయవద్దు అని అతని మంత్రులెందరో నోళ్ళు నొప్పి పుట్టేట్లు చెప్పారు అతనికి. రోగికి పథ్యం గురించి ఎంత చెప్పినా ఇష్టం కానట్లు, వాళ్లు చెప్పే మంచి మాటలేవీ అతని చెవికి ఎక్కలేదు. వాళ్ల సంతోషం ఇవాల్టితో ముగియనున్నది. ఇప్పుడు మాట్లాడుతూ కూర్చునేందుకు మనకు కొంచెం కూడా అవకాశం లేదు. వాళ్ళందరి కన్నుగప్పి నేను ఇక్కడికి వచ్చాను- బావిలో ఉన్న నీళ్ళు వెల్లువయి ఎక్కడికీ పోవు- నేను అక్కడేమేం చేశానో ఆ కథలన్నీ తర్వాత సవిస్తరంగా చెబుతాను. ఇక ఇప్పుడు- ఈ క్షణంలో ఏంచేయాలో చెబుతాను వినండి-

గుహలో గుడ్లగూబలన్నీ నిద్రావశాలై ఈ

లోకాన్ని మరచి ఉన్నాయి. నేను లేచి, ఆ చుట్టు ప్రక్కల ఆవులు ఉండే తావులకు వెళ్ళి, గడ్డీ గాదం తెచ్చి, గుహ వాకిట్లో పెట్టి, మిమ్మల్ని పిలుచుకొని పోయేందుకు వచ్చాను. మనందరం ఇప్పుడు వెళ్ళి, ఆ గడ్డికి మంట పెట్టి, నిద్రపోయే గుడ్లగూబలన్నిటినీ పెద్దనిద్ర పోయేట్లు (చచ్చిపోయేట్లు) చేద్దాం. ఇప్పుడు మనవాళ్లందరూ కదలాలి- మండే కొరువులు ముక్కుల్లో కరచుకొని బయలుదేరాలి. నాతోపాటు వచ్చి గుడ్లగూబల పనిని ముగించాలి" అన్నది.

కాకులన్నీ వెంటనే బయలుదేరాయి. చిరంజీవి కూడా మండే పుల్లను ఒకదాన్ని ముక్కున కరచుకొని, మిగిలినవాళ్లందరికీ దోవ చూపిస్తూ ముందు నడిచింది. అలా దండుగా బయలుదేరిన ఆ కాకులన్నీ పెద్ద పెద్ద కొండలు దాటుకొని వచ్చి నిశ్శబ్దంగా గుడ్లగూబల గుహ ముందు నిలచాయి. అక్కడ గుహద్వారం ముందు పేర్చిన పుల్లలకు మరికొన్ని పుల్లలు చేర్చి, వాటిని అంటించి రెక్కలతో విసరాయి. అప్పుడు రగిలిన ఆ మంటలు గుహ అంతర్భాగం వరకూ దూరాయి. కట్టెపుల్లలనుండి వెలువడిన పొగ గుహ అంతటా ఒక్కసారిగా కమ్ముకున్నది.



ఆ దెబ్బకు ఒక్కసారిగా మేల్కొన్న గుడ్లగూబలు చెవులు పిక్కటిల్లేలా అరుస్తూ, దారీ తెన్నూ కానక అటూ ఇటూ తిరిగాయి. గుహ అంతటా కమ్ముకున్న పొగ, మంటలు వాటినీ ఎటూ పోనివ్వలేదు. వాటి కష్టానికి నిద్రమత్తు కూడా తోడయ్యి, అవన్నీ తమ రాజు వద్దకు చేరి, ప్రభువని కూడా చూడక "అయ్యా! 'ఈ చిరంజీవి మనకు శత్రువు; దీన్ని చేరదీయద్దు. కీడు మూడుతుంది' అని

చెవిలో ఇల్లు కట్టుకొని పోరాం. అయినా మా మాటల్ని వినలేదు నువ్వు. మా సలహాలన్నీ పెడచెవినబెట్టి, నీ మనస్సును పట్టుకున్న పిచ్చిని వెనకవేసుకొని వచ్చావు. ఇతరులెవ్వరూ అందుకోజాలని పదవిలో ఎదురులేకుండా బ్రతికిన నువ్వు, అంతులేని ఐశ్వర్యం ఉండి కూడా తినలేనివాడిలాగా తయారయ్యావు. నీ సామ్రాజ్యాన్ని నువ్వే నిష్కారణంగా కూలదన్నుకున్నావు. లేకలేక కన్న సంతానాన్ని, ఎన్నటికీ సంపాదించుకోలేని బంధుజనాన్నీ, ప్రాణ సమానులైన స్నేహితులను ఊరికే మ్రింగినవాడివైనావు. మా మాట వినక, శత్రువుకు చోటు ఇచ్చిన ఫలితం- నిన్ను భూతంలాగా కబళిస్తున్నది. ఇప్పుడైనా నీ అహంకారం అణిగిందా?" అని ఉపమర్దనుడిని తిట్టాయి.

ఆ సరికి మంటలు, పొగ గుహ మూల మూలలా క్రమ్ముకున్నాయి. ఆ వేడికి గుడ్లగూబల రెక్కలన్నీ కమిరి పోయాయి. ఇక తట్టుకోలేక, అవన్నీ గుహ మూల మూలల్లోకి దూరుకొని, మంటల్లో మాడి చనిపోయాయి.

ఈ విధంగాశత్రువులందరూ నశించి, కొద్ది సేపట్లోనే గుహ అంతా ఏనుగు తిన్న వెలగపండు మాదిరి ఖాళీ అయిపోగానే, కాకులన్నీ సంతోషంతో గంతులు వేసి, చిరంజీవిని కౌగలించుకొని అభినందించాయి.



"ఓయీ, చిరంజీవీ! నువ్వు పట్టు పట్టబట్టి కదా, మనందరం ఈ విజయం కళ్ల చూడగలిగింది?! ఇక్కడినుండి నువ్వు వచ్చి మా కంట పడనంత కాలమూ మేం ఎట్లా బ్రతికామో మాకే తెలీదు. మా అందరి ప్రాణాలూ నువ్వే. నువ్వులేక మేం ఇక్కడ ఒక్క నిముషమైనా నిలువ గలిగే వాళ్లమా? నీ

తెలివితేటల వల్లనే గదా, ఆ గుడ్లగూబలు ఒక్కటన్నా మిగలకుండా అన్నీ సమూలంగా నశించాయి?!




ఇప్పుడు మా మనసుల్లో కల దు:ఖం అంతా ఉపశమించింది. గొప్ప పుణ్యం ఏదో చేసుకొని ఉంటాం, అందువల్లనే మాకు నీలాంటి స్నేహితుడు దొరికాడు. ఇంక మాకు ఏమి తక్కువ?" అని పలురకాలుగా చిరంజీవిని మెచ్చుకున్నాయి.

కాకిరాజు మేఘవర్ణుడు కూడా చిరంజీవిని మెచ్చుకొని, కాలి పొగచూరిన శత్రువుల గుహనంతా కలయ తిరిగి చూసి సంతోషపడ్డది. అటుపైన కాకులన్నీ దిక్కులు పిక్కటిల్లేట్లు 'కావ్..కావ్'మనని అరుస్తూ తమ సొంత గూళ్ళకు చేరుకొని సుఖించాయి."

చక్రవాక మంత్రి హిరణ్యగర్భుడికి ఈ విధంగా కాకి-గుడ్లగూబల కథను చెప్పి, 'అందుకనే, శత్రువును ఇంట్లో పెట్టుకుంటే చాలా ఆపదలు కొనితెచ్చుకున్నట్లవుతుంది' అంటారు. ప్రభువులవారు ఏమనుకుంటున్నారోగాని, నాకైతే ఈ కాకిని నమ్మటం అన్నివిధాలుగానూ అనర్థదాయకమే అనిపిస్తున్నది. తమరు ఈ కాకి తీపి పలుకులకు మోసపోయి, ఇతను మనకు యుద్ధంలో సాయపడతాడని ఉవ్విళ్ళూరుతున్నట్లు తోస్తున్నది. నిజంగా చెప్పాలంటే ఇతను చక్కెర పూత పూసిన విషమే తప్ప, మరేమీ కాదు. నదిలో ప్రవహించే చల్లటినీళ్ళే ఒడ్డున ఉన్న చెట్లను నిర్మూలిస్తాయని గమనించాలి తమరు. ఏ విధంగా చూసినా ఈ నీలవర్ణుడు అనుమానించదగినవాడు తప్ప, నిజంగా ఆదరించదగినవాడు అనిపించటంలేదు. ఈయన చేసే సాయం ఎంతటిదో దేవుడెరుగు; మనకు అపాయం చేయకపోతే చాలు.

కొంచెం వింటానంటే నా మనసులో ఉన్న మంచి మాట- మరొకటి చెబుతాను- దాన్ని అమలు చేద్దాం. లేదంటే కూడా పరవాలేదు- మేలు కోరి చెప్పే మాటను కనీసం ఆ భగవంతుడైనా మెచ్చుతాడేమో:



'దుష్టకార్యం' అని భావించకుండా, వీడిని ఈ క్షణమే చంపేద్దాం. వీడు పోతే మన మనసులను ఆవరించి ఉన్న ఈ పీడ అంతా వదిలిపోతుంది- నిజం" అని చెబుతున్న మంత్రి మాటలకు హిరణ్యగర్భుడు చిరునవ్వు నవ్వి- "నువ్వన్నదంతా నిజమే. అయినా ఓ సంగతి ఆలోచించు. కొత్తగా వచ్చినంత మాత్రాన 'నమ్మకస్తుడు కాదు' అని నిశ్చయించేయటం సరైన పని కాదు. ఇతడు ఇంతవరకూ మనకు ఏ చిన్నపాటి ద్రోహమూ చేయలేదు. ఎవరి గుణాలైనా 'ఇలాంటివి' అని వాడి ప్రవర్తననుండి గ్రహించాలి తప్ప, వాడి పుట్టుకనుండి, జాతి నుండి కాదు. ఒక్కోసారి మన ప్రమేయం లేకుండా వచ్చిన కొత్తవాళ్ళే మేలు చేసేవాళ్లవుతారు; దగ్గరనుకున్నవాళ్ళే ఒక్కోసారి కీడు తలపెడతారు. మన శరీరంలోనే పుట్టిన రోగం మనకు కీడు చేసిన సమయంలో, వేరే ఎక్కడో పుట్టిన ఔషధం మనకు మేలు చేయట్లేదా? కొందరు మొదట హితులలాగా కనబడతారు; ఆ తర్వాత వాళ్ళు శత్రువులవుతారు. మరికొందరు మొదట అహితులమాదిరి అనిపిస్తారు, కానీ అవసరం పడినప్పుడు హితులవుతారు. ఇతను మనకు ఏ కొంచెం కీడూ తలపెడతాడని అని నాకు అనిపించటంలేదు. మనకు అపకారమే చేసేవాడైతే ఆనాడు కొలువులో చిలుకను చంపేందుకు అంత గొప్పగా ముందుకెందుకు

వస్తాడు? మనమీద గల వాత్సల్యం కారణంగా మనకు మేలు చేసేందుకు వచ్చాడుతప్ప, వేరే పాపం తెలీదు ఇతనికి. ఇతను పరమ ధార్మికుడు; సత్య సంధుడు. పరీక్షకోసం అన్నట్లుగా ఇతన్ని కొన్నాళ్ళు మన దగ్గర ఉంచుకొని, ఈ లోపల ఇతనిలో ఏదైనా అవగుణం కనిపిస్తే- అప్పుడు ఇతన్ని ఏదైనా చేసినా లోకం మెచ్చుతుందిగాని, తొందరపడి, ధర్మం మరచి, నిష్కారణంగా ఏదైనా కీడు చేస్తే లోకం మనల్ని 'ఛీ' అనదా?

అంతేకాదు; నేరుగా మన ప్రత్యర్థి పక్షంవాడు అని కదా, 'ఈ పక్షిని నమ్మకూడదు' అంటున్నది? 'పనిని నెరవేర్చుకోవాలి' అనే పట్టుదల గలవాడు ఒక్కోసారి శత్రువును కూడా కలుపుకొని మెలగాలి. అటు చూస్తే బలవంతుడైన శత్రువు మనమీద యుద్ధానికి వచ్చి ఉన్నాడు. మనం ఇప్పుడు ఇతన్ని విడనాడటం ఏమంత ప్రయోజనకరం కాదు. కనీసం మన అవసరం తీరేంతవరకూ మనం ఇతనితో స్నేహం చేయటం మంచిది. శత్రువులకు హితుడైనవాడి పట్ల బుద్ధిమంతుడి పలుకు వెన్నలాగా మృదువుగా ఉండాలి; హృదయం ఇనుమంత కఠోరంగా ఉండాలి. 'చెలిమితో చేదైనా తినిపించవచ్చుగానీ, బలవంతంచేసి పాలు కూడా త్రాగించలేం' అని నానుడి వినలేదా?

పని నెరవేరటం కోసం శత్రువుతో స్నేహం చేసినా కూడా, మనసులో నమ్మక, అప్రమత్తుడై ఉడటం బుద్ధిమంతుల లక్షణం' అని పెద్దలు చెబుతారు. మన అవసరం తీరేంతవరకూ, బయటికి ఈ నీలవర్ణుడిని నమ్మినట్లు నటిద్దాం; లోపల నమ్మకుండా ఉందాం. ముల్లుతోటి ముల్లుని తీసి, అటుపైన ఆ ముల్లును కూడా పారవేసే విధంగా ఇతని సహకారంతో ఆ శత్రువును ఓడించి, మన అవసరం నెరవేరాక ఇతన్ని విడనాడదాం. గతంలో ఎలుక ఒకటి, అవసరార్థం ఓ పిల్లితోటి స్నేహం చేసి, అవసరం తీరిన తర్వాత దాన్ని విడచిపెట్టిందట- నీకా కథ చెబుతాను విను: అని ఎలుక-పిల్లుల కథ చెప్పటం మొదలు పెట్టింది. (ఆ కథ వచ్చేసారి...)



అమ్మాయి నాణెం

సేకరణ: రిత్య, నాలుగవ తరగతి, జీవన వికాస విద్యా వనం, పోరంకి, విజయవాడ.

అనగనగా ఒక ఊరిలో ఒక అమ్మాయి ఉండేది. ఆ అమ్మాయి పేరు రిత్య. ఒకరోజు రిత్యకి ఒక నాణెం దొరికింది. అది ఓ మాయ నాణెం. కానీ రిత్యకు ఆ సంగతి తెలీదుకదా, దాన్ని తీసుకొచ్చి, వాళ్ల ఇంట్లో ఉన్న బియ్యం బస్తాలో వేసింది.

ఇంక అప్పటినుండి ఆ బియ్యం పెరగటం మొదలు పెట్టింది. బస్తాలోంచి ఎంత బియ్యం తీస్తే అంతకు రెట్టింపు బియ్యం వచ్చి చేరుకునేది బస్తాలో!

ఆ సంగతి తెలిసాక రిత్య ఊళ్ళో అందరికీ బియ్యం ఇవ్వటం మొదలు పెట్టింది. బదులుగా కూరగాయలున్నవాళ్ళు ఆ పాపకు కూరగాయలు ఇచ్చేవాళ్ళు; పప్పులు ఉన్నవాళ్ళు పప్పులు ఇచ్చేవాళ్ళు; ఏమీలేనివాళ్ళు ఆ పాప పేరు చెప్పుకొని ఇంత

అన్నం తినేవాళ్ళు- అలా రిత్య సుఖంగా బ్రతకటమే కాదు; ఊళ్ళో మంచి పేరు కూడా సంపాదించుకున్నది.

అయితే ఈ సంగతి తెలుసుకున్నది, అడవిలోని ఒక పులి. అది చాలా పెద్దది. దానికి ఆ నాణెం మీద ఆశ పుట్టింది. 'కానీ రిత్యనుండి ఆ నాణాన్ని లాక్కునేదెట్లాగ?' ఎంత ఆలోచించినా దానికి ఉపాయం ఏమీ తట్టలేదు.



అందుకని అది నేరుగా రిత్య ఇంటి తలుపు తట్టి- పదునైన తన కోరలు, వాడిగా ఉన్న కాలి గోళ్ళు చూపించి బెదిరించింది- 'మర్యాదగా నీ దగ్గరున్న నాణెం ఇచ్చెయ్..లేకపోతే నిన్ను ఏం చేస్తానో చూడు!' అని.

'నాణెమా?!అయ్యో, అదిప్పుడు నా దగ్గర లేదే, వచ్చే అమావాస్యనాడు రాత్రికి మా ఇంటికి రా. నీకు ముందుగా ఓ చిన్న పూజ చేసి, నాణెం ఇచ్చి పంపిస్తాను' అన్నది రిత్య ధైర్యంగా.

సరేనని పులి వెళ్ళిపోయాక, రిత్య లెక్కలు వేసుకున్నది- అమావాస్య ఇంకా నాలుగు రోజులున్నది. ఈ నాలుగు రోజుల్లోనూ రిత్య ఇంటికి ఏం చేయాలో అది చేసి పెట్టుకున్నది. దాంతోబాటు 'మా ఇంటికి ఇవాళ్ళ రాత్రికి ఒక అతిథి వస్తున్నాడు. వాడికి పూజ చెయ్యాలట- మీరంతా కట్టెలు, బాడిసెలు, పారలు పట్టుకొని రండి- వాడికి అవంటే చాలా ఇష్టం మరి!' అని ఊరంతా చెప్పి వచ్చింది.

రాత్రి ఇంకా చీకటి పడకనే ఊళ్ళో జనాలంతా రిత్య ఇంటికి చేరుకున్నారు. రిత్య వాళ్లందరినీ ఇంటి చుట్టూతా పొదల్లో మాటు వేసుకొని ఉండమన్నది. ఇదంతా తెలీదుకదా, పులికి?

అది దర్జాగా నడచుకొంటూ రిత్య ఇంటికి వచ్చింది.

"అమ్మాయ్!తలుపు తియ్! నేను లోపలికి వస్తాను" అని అరిచింది.

రిత్య చప్పుడు చెయ్యలేదు.



"ఎక్కడుంది ఈ పిల్ల?" అనుకొని పులి తలుపును తోసింది. తలుపు కిర్రుమని శబ్దం చేస్తూ తెరచుకున్నది.

పులి అనుమానంగా లోనికి అడుగు పెట్టిందో లేదో, జర్రున జారింది- అక్కడ నేలమీదంతా బఠానీలు పరచి ఉన్నాయి మరి!

పులి పోయి రపాలున గోడకు కొట్టుకున్నది. లేచి మళ్ళీ జారింది- మళ్ళీ గోడకు కొట్టుకున్నది. ఇట్లా కొన్నిసార్లు జరిగాక, అది వంటింట్లోకి చేరుకొని, కొంచెం ఊపిరి పీల్చుకున్నది.

అంతలో రిత్య అటక మీద పెట్టిన గుడ్డు ఒకటి ఠప్పున దాని తలమీద పడింది. ఆ దెబ్బకు పులికి కళ్ళు తిరిగి నక్షత్రాలు కనబడ్డాయి. గుడ్డు సొన చేదుగా దాని నోట్లోకి కారింది.

పులి 'థూ థూ!' అని ఉమ్మివేస్తూ నీళ్ళకోసం వెతుక్కున్నది.

అక్కడ కనిపించిన కుండలో చెయ్యి పెట్టేసరికి అందులో ఉంచిన తేళ్ళు దాని చేతిని పట్టుకొని కసితీరా కొరికాయి. తేలు కుట్టిన పులికి ఇప్పుడు దిక్కులు తెలీలేదు- అది అటూ ఇటూ పరుగెత్తి, జారి, గోడలకు కొట్టుకొనే సరికి, ఫ్యాను తిరగటం మొదలుపెట్టింది. ఫ్యాను మీదున్న కర్ర సూటిగా వచ్చి దాని ముక్కును పచ్చడి చేసింది!

అంతలో పులికి బయటికి వెళ్ళే దారి కనబడింది. అది ఆ దారి వెంబడి బయటికి

వచ్చేసరికి ఊళ్ళో జనాలంతా కట్టెలతోటీ, బాడిసెలతోటీ, గడ్డపారలతోటీ దాని మీదికి దూకారు. వాళ్ల తాకిడికి తట్టుకోలేక పులి ఉక్కిరి బిక్కిరైంది- 'బ్రతికితే అడవిలో బ్రతుక్కుంటాను-మళ్ళీ ఈ పల్లెలో పాదం మోపను దేవుడో' అని మొత్తుకున్నమీదట, జనాలు దాన్ని ప్రాణాలతో వదిలారు. అది ఇక వెనక్కి తిరిగి చూడకుండా అడవిలోకి పరుగెత్తింది!

"హమ్మయ్య! నా నాణెం నా దగ్గరే భద్రంగా ఉంది!" అని ఊపిరి పీల్చుకున్నది రిత్య.





ఛెస్ విజేత

'ఓటమే విజయానికి తొలి మెట్టు' అని చెబుతూ శ్రీరాం రాసిన ఈ కథ చదివి, ఎలా ఉందో చెప్పండి..
సేకరణ: పి.వి. శ్రీరామ్, 5 వ తరగతి, లక్ష్మీ హైస్కూలు, అద్దంకి, ప్రకాశం జిల్లా.

రామాపురంలో ఉండే అజయ్‌కి చదరంగం ఆట అంటే చాలాఇష్టం. వాడు చదరంగం చాలా బాగా ఆడేవాడు కూడా.

అజయ్ తమ్ముడు అనిల్‌కి కూడా చదరంగం ఆడటం అంటే ఇష్టం. అయితే వాడికి ఆ ఆట ఏమంత బాగా వచ్చేది కాదు.

స్నేహితులతో చదరంగం ఆడినప్పుడల్లా అజయే గెలిచేవాడు. దాంతో వాళ్ళ స్నేహితులకు అజయ్‌తో చదరంగం ఆడటం అంటే ఇష్టం లేకుండా పోయింది. వాళ్ళు వాడిని తప్పించుకొని తిరగటం మొదలు పెట్టారు.

ఇక అజయ్‌కి ఇష్టంగా దొరికింది అనిల్ ఒక్కడే. అజయ్ ఎప్పుడు 'ఛెస్ ఆడదామా?'

అనగానే "ఓ, రా, రా - ఆడదాం!' అని ఆడి, సంతోషంగా ఓడిపోయేవాడు అనిల్. ఎన్నిసార్లు ఆడితే అన్నిసార్లు ఓడేవాడు; అయినా వాడికి చీమకుట్టినట్లు కూడా ఉండేది కాదు.

ఒక సారి రామాపురంలో చదరంగం పోటీలు పెట్టారు. వాటిలో అజయ్, అనిల్‌తో పాటు ఇంకా చాలా మంది పిల్లలు పాల్గొన్నారు. తెలిసినవాళ్ళు అందరూ ఆ పోటీల్లో అజయ్ గెలుస్తాడని ఊహించారు. కానీ ఆ పోటీలలో చివరికంటా నిలిచి గెలిచింది, అనిల్!

అందరూ నిర్ఘాంతపోయారు.

పోటీలు ముగిసాక అజయ్ అనిల్‌ని అడిగాడు: "నీకు అదృష్టం కలిసి వచ్చినట్లుందిరా, తమ్ముడూ! లేకపోతే ప్రతిసారీ నాతో ఓడే నువ్వు, ఈ పోటీలలో ఎట్లా గెలవగలిగావు?" అని.

"నేను నీతో చాలా సార్లు చదరంగం ఆడాను కదా, ప్రతి సారీ ఓడాను. అట్లా ఓడినప్పుడల్లా నేను ఓ క్రొత్త విషయాన్ని తెలుసుకున్నాను. నా ఓటమికి కారణాలు అర్థం చేసుకుంటూ వచ్చాను. ఇప్పటి విజయానికి కారణం అదే!" అన్నాడు అనిల్ .

నవ్వండి!

సంతోషం!

వ్యాపారి: సార్! మీ సినిమా విడుదలైందంటే మాకు పండగే సార్!

హీరో: చాలా సంతోషం. మీరు థియేటర్ ఓనరాండీ?

వ్యాపారి: ఓనర్‌నేనండి, కానీ థియేటర్‌కి కాదు.

హీరో: మరి?!

వ్యాపారి: మా కంపెనీ తలనొప్పికి మందు తయారు చేస్తుందండి.



మూఢనమ్మకాలకు స్వస్తి!

రచన: ఎం. సుష్మ, 8 వ తరగతి, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, నరసన్నపేట, శ్రీకాకుళం జిల్లా.

నగరాలకు దూరంగా ఉన్న ఓ పల్లెటూరు, మూఢ నమ్మకాలకు పుట్టినిల్లు- ఆ ఊర్లో 8 వ తరగతి చదువుతోంది, స్వాతి. స్వాతి చాలా చురుకైనది. ఓసారి ఆ అమ్మాయి, తన స్నేహితురాలు రాణితో కలిసి వస్తుంటే దారిలో ఓ ఇంటి చుట్టూ గుమిగూడి గందరగోళంగా ఉన్న గుంపు ఒకటి కనబడింది.

"ఏమైందే అక్కడ, అంతమంది గుమిగూడారు?" అడిగింది స్వాతి.

"అది భార్గవక్క వాళ్ళ ఇల్లు. నిన్న సాయంత్రం భార్గవక్కకు దెయ్యం పట్టిందట గదా, ఇప్పుడు అందరూ చేరి దయ్యాన్ని పారిపోగొడుతున్నట్లున్నది. మనమూ పోయి చూద్దామా?" అంది రాణి.

"దెయ్యం పట్టిందా? అంటే ఏంటి? అసలు ఏమైందట?" అడిగింది స్వాతి, కంగారుగా.

"నిన్న ఏకాదశి ఉపవాసం కదా. భార్గవక్కకూడా ఉపవాసం ఉండి, మధ్యాహ్నంగా కొండ మీద ఉన్న దుర్గమ్మ తల్లి గుడికి వెళ్ళిందట. అక్కడ కొలనులో నీళ్ళు పట్టుకొని, దుర్గమ్మ తల్లి విగ్రహం దగ్గరికి తెచ్చి పెట్టిందట. ఆ తర్వాత విగ్రహానికి అభిషేకం చేయాలని లేచి నిలబడిందట- వెంటనే ఏమైందో, ఏమో- కళ్ళు తిరిగి పడి పోయిందట. సరిగ్గా ఆ సమయానికి అక్కడ చాలామంది ఉండబట్టి సరిపోయింది. వాళ్లంతా వెంటనే ఆమె పేరు మీద ఏవేవో పూజలు చేసారు. అక్కని అలాగే ఎత్తుకొని ఇంటికి తీసుకొచ్చారు. ఇంటికొచ్చేసరికి అక్క కోలుకున్నది- అయితే ఆ తర్వాత కూడా అక్క సరిగాలేదట- నాలుగైదుసార్లు కళ్ళు తిరిగి పడిపోయిందట. ఇంట్లోవాళ్ళు కంగారు పడి దాసు దగ్గరికి పట్టుకెళ్ళారు. ఆయన కనుక్కున్నాడు, అక్కకి దయ్యం పట్టిందని. ఏదో చిన్న పూజ చేసి తాయెత్తు కట్టాడట; అయినా ఇల్లు చేరుకోగానే మళ్ళీ కళ్ళు తిరిగి పడిపోయిందట అక్క. అందుకే, మళ్ళీ దాసు వచ్చినట్లున్నాడు ఇప్పుడు" అంది రాణి.

స్వాతి, రాణి ఇద్దరూ అక్కడికి వెళ్లి దూరంగా నిలబడి చూశారు: "నన్ను వదలండి, కొట్టకండి" అంటూ భూమి దద్దరిల్లేలా ఏడుస్తూ ఉంది భార్గవక్క. "నిన్ను వదిలితే మమ్మల్ని పట్టుకోవడానికా!" అంటూ మరింత గట్టిగా కొడుతున్నాడు దాసు. రక్తంతో తన శరీరం తడిసి పోతున్నది. చుట్టూ నిల్చున్నవాళ్ళు ఎవ్వరూ అక్కని చూసి జాలి కూడా పడటం లేదు. భార్గవక్క రక్తపు మడుగులోంచి "రక్తం కారుతోంది, ఊపిరి ఆడటం లేదు" అంటూ అరిస్తే "నువ్వు మా రక్తం తాగడానికే వచ్చావే" అంటూ జుట్టు పట్టుకొని కొడుతున్నాడాయన.

స్వాతికి ఏడుపొక్కటే తక్కువ. అక్క పరిస్థితి చూసి చాలా భయం వేసింది. గబుక్కున అక్కడికి దగ్గరలోనే ఉన్న తమ చిన్నత్త వాళ్ళింటికి పరుగు పెట్టింది. చిన్న త్త బాగా చదువుకున్నదీ, మంచిది కూడా. 'ఆమె అయితే భార్గవక్కను కాపాడగలదు' అనిపించింది స్వాతికి. చిన్నత్త వెంటనే

బయలుదేరి వచ్చింది. స్వాతి, చిన్నత్త ఇద్దరూ కలిసి వెళ్ళేసరికి అక్కడ చేరిన జనాలంతా కలిసి కొడుతున్నారు భార్గవక్కను.

స్వాతి, చిన్నత్త ఇద్దరూ ధైర్యంగా జనాలకు అడ్డుపడి, చివరికి ఎలాగో ఒకలాగా భార్గవక్కను వాళ్ల బారినుండి కాపాడి, లోపలి గదిలోకి తీసుకెళ్ళారు. "అమ్మా, భార్గవి బాగా నీరసించి పోయింది. డాక్టరు గారి దగ్గరకు తీసుకెళ్ళండి. ఇలా రక్తం వచ్చేటట్లు కొట్టడం సరికాదు. ఆమెను హింసించకండి, దయచేసి నా మాట వినండమ్మా" అని గట్టిగా చెప్పింది చిన్నత్త, వాళ్ళ ఇంట్లోవాళ్ళకు. దానికి అక్కడున్న వాళ్ళంతా "దీనికి డాక్టరుతో ఏం పని? దాసు దగ్గరికి తీసుకెళ్ళి వదిలెయ్యాలి- రెండు రోజుల్లో దయ్యం గియ్యం పారిపోతుంది, మీ బిడ్డ మీకు దక్కుతుంది" అన్నారు.

స్వాతి, చిన్నత్త ఇద్దరే అయ్యేసరికి, భార్గవక్కను అప్పటికి తప్పించగల్గినా, ఇంటి వాళ్ళని మటుకు డాక్టరు విషయకంగా ఒప్పించలేక పోయారు.

అక్కడున్న వాళ్ళు ప్రవర్తించే తీరును చూసి స్వాతికి చాలా ఆశ్చర్యమూ, బాధా కలిగాయి. చిన్నత్త ఎంత చెప్పినా వాళ్ళు వినటమే లేదు. చివరికి వాళ్ళు చిన్నత్తను, స్వాతిని అక్కడినుండి పంపించేశారు కూడా!



ఇంటికి చేరుకోగానే స్వాతి వాళ్ళ నాన్నను ఆశ్రయించింది. స్వాతి వాళ్ళ నాన్న మానవత్వం ఉన్న మనిషి. ఆయనకు స్వాతి అంటే చాలా ఇష్టం కూడా- స్వాతి ఏమడిగినా ఇస్తారాయన. స్వాతి వాళ్ళ నాన్నతో "నాన్నా, ఒకమ్మాయికి దెయ్యం పట్టిందని కొడుతున్నారు" అంటూ జరిగిన విషయం

చెప్పింది. "మీ స్నేహితుడున్నాడు కద నాన్నా, డాక్టరంకుల్? ఆయన్ని మనమే అక్కడికి తీసుకెళ్దాం నాన్నా! కావాలంటే, ఆ డాక్టర్ అంకుల్ కి కావలసిన డబ్బులు నా పుట్టిన రోజు కోసం దాచిన డబ్బుల నుండి ఇస్తాను" అని ప్రేమగా అడిగింది స్వాతి.

స్వాతి వాళ్ళ నాన్న ఇక ఆగలేదు. డాక్టర్ అంకుల్‌ని, ఆయనతోబాటు ఇన్స్పెక్టరుగారిని ఇద్దరినీ వెంటనే రమ్మని పిలిచారు. స్వాతి, వాళ్ళ నాన్న, చిన్నత్త, డాక్టరంకుల్, ఇన్స్పెక్టరుగారు- అందరూ కలిసి వచ్చాక, ఇక ఊరి జనాలు ఎవ్వరూ నోరెత్తలేకపోయారు. డాక్టరంకుల్ భార్గవిని చెకప్ చేసారు. తరువాత తెలిసింది అసలు నిజం- "ఈ పాప రక్త హీనతకు నిలువెత్తు నమూనా. ఉపవాసాలు ఎక్కువగా చేయడం వల్ల, ఒంట్లో శక్తి తక్కువై కళ్ళు తిరిగాయి. అంతే తప్ప ఏ దెయ్యమూ లేదు; గియ్యమూ లేదు. అసలే బలహీనంగా ఉన్న పాపను పట్టుకొని రక్తం వచ్చేటట్లు కొట్టారు: మనిషి అని మరచి పోయారు. అందులోనూ ఒక ఆడపిల్లని! ముందు ఆ అమ్మాయికి ఏమైనా పండ్ల రసం ఇవ్వండి! త్వరగా అన్నం పెట్టండి! రెండు రోజుల్లోబాగు కాకపోతే నన్నడగండి! ఏంటమ్మా, ఈ రోజుల్లోకూడా ఇంత మూర్ఖత్వమా?" అని తిట్టి, రక్తహీనత తగ్గేందుకు టానిక్ ఇచ్చారు డాక్టరంకుల్. దెబ్బలు తగ్గడానికి కొన్ని మాత్రలు, ఆయింటుమెంటు ఇచ్చారు.



భార్గవక్క ఆహారం తీసుకొని, ఆ టానిక్ వేసుకుంది. అప్పటి నుంచి ఉపవాసాలు మాని, చెప్పిన మందులు సరిగా వాడింది. మూడు రోజులకే ఆరోగ్యంగా

తయారయ్యింది.

డాక్టరు గారు స్వాతిని మెచ్చుకున్నారు. డాక్టరు ఫీజుగా తను దాచుకున్న డబ్బుల్ని ఇస్తే ఆయన తీసుకోలేదు. "చూడుపాపా, మీ ఊళ్ళోనే కాదు; ఇంకా చాలా ఊళ్ళలో ఇదే పరిస్థితి ఉన్నది. అసలు వాస్తవాలను అందరికీ చెప్పాల్సిన పని,చాలా పెద్దది ఉంది- నువ్వు నాకు ఇవ్వాల్సింది ఫీజు డబ్బులు కాదు- సమయం! నువ్వు మాతోపాటు వస్తానంటే, మనం ఇలాంటి పిచ్చి నమ్మకాలను నిర్మూలించేందుకుగాను యాత్ర ఒకటి పెట్టుకుందాం. మనతోబాటు ఇద్దరు మెజీషియన్లు కూడా వస్తామన్నారు. ఏమంటావు?" అన్నారు డాక్టరంకుల్.

స్వాతి వాళ్ల నాన్నవైపు చూసింది. ఆయన సంతోషంగా ఒప్పుకున్నారు.

స్వాతి వాళ్ళ ఊరిలోనే కాదు, ఆ చుట్టు ప్రక్కల గ్రామాలన్నిటా ఒక కొత్త చైతన్యం మేల్కొంది: "దేవుడి పేరిట, దెయ్యాల పేరిట జరిగే హింస వల్ల లాభం లేదు సరికదా - విలువైన మనిషి జీవితాన్ని యాతన పెడుతున్నాం! మనిషి లాగా పుడితే సరిపోదు. మనిషిగా ఎదగాలి. ప్రతి దానికీ ఒక శాస్త్రీయ కారణం ఉంటుంది. కార్య-కారణాలను వదిలిపెడితే మనిషి జంతువుకన్నా హీనమైపోతాడు. మూఢనమ్మకాలను వదిలిపెడదాం! మానవత్వాన్ని స్వాగతిద్దాం" అని అందరికీ అనిపించసాగింది.

రిమోట్ పుట్టుక!

నవ్వండి!

నర్స్: సార్! కంగ్రాట్స్ సార్!

సార్: ఎందుకమ్మా?!

నర్స్: మీ ఇంట్లో మహాలక్ష్మి పుట్టింది సార్!

సార్: వాటేటెక్నాలజీ! నిజంగానే అద్భుతం కదూ? నా భార్య ఆసుపత్రిలో పడకమీద ఉంది, బిడ్డ మాత్రం ఇంట్లో పుట్టింది!



స్నేహితులు

రచన: ఎస్. ప్రవీణ్, 5 వ తరగతి, ప్రకృతి బడి, చెన్నేకొత్తపల్లి, అనంతపురం (జిల్లా)

యశ్వంత్, మీనాక్షి, ప్రవీణ్ ముగ్గురూ చాలా మంచి స్నేహితులు. బళ్ళో ఏ అవసరం వచ్చినా వీళ్ళు ఒకరికొకరు సాయం చేసుకునేవాళ్ళు; ఇతరులకు కూడా సహాయపడేవాళ్ళు.

ఒక రోజున యశ్వంత్ కు ఒక సందేహం వచ్చింది. ఏమంటే - 'ఇప్పుడు మేము ముగ్గురం మంచి స్నేహితులం కదా. అయితే మా ఈ బడిలో చదువులు అయిపోయాక మేం అందరం విడిపోతాం కదా, ఆ తరువాత మాతో ఎవరు స్నేహం చేస్తారు? అప్పుడు మేము ఒంటరి వాళ్ళం అయిపోతాం కదా? ఎలాగ?' అని. ఈ ఆలోచన వచ్చేసరికి వాడు విచారంగా అయిపోయాడు.

అప్పుడు మీనాక్షి, ప్రవీణ్ వచ్చి "ఎందుకురా యశ్వంత్, ఎందుకు, అలా ఉన్నావు?" అని అడిగారు.

"ఏమీ లేదు; ఈ బళ్ళో మన చదువు అయిపోయినాక ఇక మనందరం విడిపోతాం కదా, అప్పుడు మనతో ఎవరు స్నేహం చేస్తారు?" అడిగాడు యశ్వంత్.



"అవును కదా, మనతో ఎవరు స్నేహం చేస్తారు?" అని ముగ్గురూ ఆలోచిస్తూ విచారంగా ఉండిపోయారు.

అప్పుడు మాష్టారు వచ్చి, వాళ్ళను "ఎందుకలా ఉన్నారు?" అని అడిగాడు. వాళ్ల ఆలోచన విని, ఆయన నవ్వి- "అయ్యో పిచ్చి పిల్లల్లారా, మీరు వేరే స్కూలుకు మారితే మీకు ఎవరో ఒకరు పరిచయం అవుతారు కదా, వాళ్ళు మీకు స్నేహితులౌతారు! లేకుంటే మీరు ముగ్గురూ విడిపోయాక ఎప్పుడో ఒకప్పుడు కలుస్తూనే ఉంటారు కదా, ఇంక దిగులేముంది?" అన్నారు. "అవును కదా!" అని వీళ్ళంతా సంతోషించారు.

ఆరోజు రాత్రి మీనాక్షికి ఒక కల వచ్చింది. ఆ కలలో మీనాక్షి, యశ్వంత్, ప్రవీణ్‌లు ముగ్గుర్నీ ఒక రాక్షసుడు ఎత్తుకొని పోయి చిత్ర హింసలు పెడుతున్నాడు. అప్పుడు వాళ్లు చదువుతున్న మూడు బడులనుండీ చాలా మంది పిల్లలు పరుగెత్తుకుంటూ వచ్చి, రాక్షసుడితో పోరాడి, వీళ్ళు ముగ్గుర్నీ రక్షించారు!

మీనాక్షికి చాలా సంతోషమేసింది- తమకు కొత్త బడులలో చాలా మంది మిత్రులు దొరుకబోతున్నందుకు.

ఆ పాపకు వచ్చిన కల విని బడిలో చిన్న పిల్లలందరికీ కూడా చాలా సంతోషం వేసింది. "మీకేమైనా అయితే మా బళ్ళో పిల్లలం కూడా అందరం వచ్చి కాపాడతాంలే, మీకుండేది నాలుగు బడుల మిత్రులు!" అన్నారు వాళ్ళు!



ఉంగరం పోయిన కథ

ఉంగరం పోయిందనుకోండి, అప్పుడు మనం ఎట్లా కంగారు పడతాం, ఏమేం ఆలోచిస్తాం, ఏమేం చేస్తాం? ఒక రకంగా ఇది 'పెద్దవాళ్ల కథే అయిపోయిందేమో 'అనిపించింది. అయినా మౌలికంగా రాసి పంపింది అమరేశ్వరి కదా అని, మీతో టీపంచుకుంటున్నాం..

సేకరణ: అమరేశ్వరి, 7 వ తరగతి, ప్రజ్ఞ ఇంగ్లీషు మీడియం స్కూలు, అద్దంకి, ప్రకాశం జిల్లా

పొడిగింపు: కొత్తపల్లి.

అనగా అనగా ఒక ఊళ్లో రాము అనే బ్యాంకు ఉద్యోగి ఉండేవాడు. నెల జీతం రాగానే అతనొక జత బట్టలు కొనుక్కోవాలనుకున్నాడు.

బట్టల దుకాణంలో సేల్స్ మ్యాన్ రకరకాల బట్టలు తీసి తన ముందు వేశాడు- వద్దంటున్నా వినలేదు. వాటిలోఒక్క జతని ఎంపిక చేసుకొనేందుకు చాలా సేపు పట్టింది రాముకు. చివరికి ఎలాగో పని అయ్యిందనిపించి, అలాగే నేరుగా టైలర్

దగ్గరికి వెళ్ళి, కొత్త బట్టలు ఇచ్చాడు కుట్టేందుకు. ఆపైన అటు నుంచి అటు పార్కుకి వెళ్ళి, భోజన సమయానికి ఇంటికి వచ్చాడు. అన్నం తింటున్న సమయంలో గమనించాడు- తనవేలికి ఉండాల్సిన బంగారు ఉంగరం..లేదు!

రాము గుండె గుభేలుమన్నది. ఆ ఉంగరం ఖరీదు పది వేల రూపాయిల పైమాటే. ఖరీదు సంగతి ఎలాగున్నా, అది తన భార్యవైపు వాళ్ళు ముచ్చటగా పెట్టిన ఉంగరం. పోయిందని తెలిస్తే భార్య ఊరుకోదు. అట్లా అని తను మళ్ళీ ఇంకొకటి కొని పెట్టుకోనూ లేడు!

ఇంక అతనికి అన్నం సహించలేదు. ఇల్లు అంతా వెతికాడు. ఉంగరం కనిపించలేదు. 'అది ఎక్కడో జారి పడిపోయి ఉండాలి- తను ఈరోజు ఎక్కడెక్కడో తిరిగాడు- ఒకచోటు అని తెలిస్తే అక్కడికి వెళ్ళి అడగొచ్చు..ఎక్కడ పడిపోయి ఉంటుంది? పార్కులో..? టైలర్ షాపులో..? బట్టల దుకాణంలో..? బ్యాంకులోనే పడి ఉందేమో; ఉదయం ఊడ్చేటప్పుడు దొరుకుతుందేమో..తను రేపు త్వరగా వెళ్ళాలి- ఊడ్చే వాళ్ళకంటే ముందు బ్యాంకు చేరుకోవాలి..' ఆలోచనలతో రాము బుర్ర వేడెక్కిపోయింది.

'ఏంటండీ, ఏమైంది, ఏం వెతుకుతున్నారు?' అడిగేసింది భార్య.

'అయిపోయింది. ఇక ఏడుపు మొదలవుతుంది..ఇంతకీ ఉంగరం ఎక్కడ పడిపోయి ఉంటుంది? పార్కులో..? టైలర్ షాపులో..?...' భార్యకి తను ఏం చెప్పాడో రాముకే తెలీదు.

రాము భార్య రాత్రి అంతా ఏడ్చింది. ఆమెకు రాత్రంతా నిద్రే లేదు. రాముకి మాత్రం తెల్లవారుజామున మగత నిద్ర పట్టింది.. ఇంకా తెల్లవారకనే రాము పార్కుకు వెళ్ళాడు. అక్కడ తను తిరిగిన చోట్లలో అంతటా వెతికాడు. ఉంగరం లాంటిదేమీ కనిపించలేదు. అటునుండి అటే బ్యాంకుకు వెళ్ళాడు. బ్యాంకులో తన సీటు దగ్గర వెతికాడు. ఉంగరం లేదు. అక్కడ ఊడ్చే వాళ్లకు చెప్పాడు తన ఉంగరం గురించి. 'కొంచెం జాగ్రత్తగా ఊడ్చండి' అన్నాడు.

అంతలో తన కోసం ఎవరో వచ్చి నిల్చున్నారని కబురు వచ్చింది. చూస్తే అతను బట్టల దుకాణంలో సేల్స్ మ్యాన్. 'అయ్యా! బట్టల మధ్య మీ ఉంగరంకనిపించింది. దాని మీద వీణ బొమ్మ మధ్యలో మీ పేరు ఉంది. మిమ్మల్ని బ్యాంకులో చాలా సార్లు చూసాను కదా, దాంతో గుర్తు పట్టాను. మీ ఉంగరం ఇదిగోండి సార్..' ఉంగరాన్ని అందించాడతను.

రాముకి సంతోషమూ, ఆశ్చర్యమూ కలగలిపి వచ్చినట్లయింది- 'ఈ ఉంగరం మీరే ఉంచుకొని ఉంటే నాకు తెలిసేది కాదు గదా' గొణిగాడు.

'పరాయి సొమ్ము పాము లాంటిది సార్! మనిషి జన్మ ఉత్తమమైనది. పరాయిసొమ్ము ఆశించేవాడు మనిషిగాపనికిరాడు. నిజాయితీ..' ఏదో నాలుగు లైన్ల మంచి మాటలు చెప్పాడతను.

'ఏంటో ఈ పిచ్చి నమ్మకాలు. వీటి వల్లనే గదా, వీడికి పదివేలు నష్టం?- లేకపోతే ఉంగరం పూర్తిగా వాడిదే అయిఉండేది కదా! అయితేనేమిలే, వీడి పిచ్చినమ్మకం వల్ల నా ఉంగరం నాకు దొరికింది- అంతేచాలు!' అనిపించింది రాముకు. సేల్స్ మ్యానుకు 'థాంక్స్' చెప్పి పంపించేసి, వెంటనే ఇంటికి ఫోను చేసి అరిచాడు- 'ఉంగరం దొరికింది! ఉంగరం దొరికింది!' అని.

'ఏమైనా కల వచ్చిందా, పరుపులోనే ఉండి అరుస్తున్నారు?' అడిగింది భార్య.

లేచి చూస్తే అప్పటికి ఇంకా తెల్లవారనే లేదు..నిజంగానే ఏదో కల వచ్చినట్లుంది. రాముకి ఏడుపు వచ్చినంత పనైంది. ఇంకా ఉంగరం దొరకనే లేదు!

తెల్లవారకనే రాము బయలుదేరి ఈసారి నిజంగానే పార్కులో అంతా వెతికాడు . పార్కునుండి వస్తూ టైలరు దుకాణంలో అడిగాడు. బ్యాంకులో ఊడ్చేవాళ్ళను అడిగి వచ్చాడు. ఎందుకైనా మంచిదని బట్టల దుకాణంలోసేల్సుమ్యానును అడిగి వచ్చాడు- ఎండకి ముఖమంతా చెమటలు పట్టాయి తప్పిస్తే, ఉంగరం ఎక్కడా లేదు. చివరికి చెమట తుడుచుకునేందుకు జేబులోంచి రుమాలును బయటికి లాగాడు-

దానితోపాటు బయటికి వచ్చి టింగుమని కాళ్లదగ్గర పడింది, ఉంగరం!

అంటే అసలు ఉంగరం నిన్నటినుండీ తన జేబులోనే ఉందన్నమాట!

బట్టల దుకాణం మీదుగా ఇంటికి వెళ్తున్న రాముకు కలలో సేల్సుమ్యాన్ అన్న మాటలు గుర్తుకొచ్చాయి.." పరాయి సొమ్ము పాము లాంటిది. మనిషి జన్మ ఉత్తమమైనది..నిజాయితీ.." అని.

"అవును- మనుషుల్లో నిజంగా ఆ మాత్రం నీతి నియమాలు లేకపోతే బ్రతకటం కష్టమే!" అనిపించిందతనికి ఈసారి.

నవ్వండి!

బ్రహ్మరాత!

అమ్మ: చిన్నా, మీ స్కూల్లో ఇవాళ్ళ ఏం నేర్చుకున్నావురా?

చిన్న: ఎలా రాయాలో నేర్చుకున్నానమ్మా!

అమ్మ: ఏం రాశావురా?

చిన్న: నేను రాసింది చదవటం వాళ్ళు నాకు ఇంకా నేర్పించలేదమ్మా!

సగం-సగం!

కిట్టు: ఎందుకురా, ఒకే రకం పుస్తకాలు రెండు కొన్నావెందుకు?

నాని: 'ఈ పుస్తకం చేతిలో ఉంటే సగం మార్కులు చేతిలో ఉన్నట్లే' అని దాని మీద రాసి ఉందిరా!

కిట్టు: అయితే ఏంటట? రెండు రెండు పుస్తకాలు ఎందుకు, కొనటం?

నాని: ఒకటి ఉంటే సగం మార్కులే- మరి రెండు ఉంటే ఫుల్ మార్కులు వస్తాయిగా?!



మంచి ఏనుగు

రచన: సి.హెచ్. నాగజయంత్, జీవనవికాసవిద్యాకేంద్రం, విజయవాడ

అనగనగా ఒక ఊళ్ళో ఒక అవ్వ నివసిస్తూ ఉండేది. ఆ అవ్వకి ధనవంతుడొకడు చిన్న ఏనుగు పిల్లని బహుమానంగా ఇచ్చాడు. అవ్వ పేదరాలు. అంత ఏనుగుకు సరిపడే ఆహారాన్ని సమకూర్చటం అవ్వ శక్తికి మించిన పని. అయినా అవ్వకు ఆ ఏనుగు పిల్లని చూస్తే ముచ్చటైంది. దాన్ని తన కొడుకుగా భావించి, ఎంతో కష్టపడి దాన్ని పెంచి పెద్ద చేసింది. ఏనుగు కూడా అవ్వకు తగినట్లే చాలా బాధ్యతతో ఎదిగింది. చుట్టుప్రక్కల ఉన్న పిల్లలందరికీ అదంటే చాలా ఇష్టం. అదికూడా వాళ్లందరితోటీ ఆడుకుంటూ సంతోషంగా ఉండేది.

ఒకసారి అవ్వ అడవిలోంచి బరువైన కట్టెల మోపు ఒకదాన్ని ఎత్తుకొని ఇంటికి రావటం గమనించింది ఏనుగు. ఆ సమయంలో అది

పొరుగింటి పిల్లలతో ఆడుకుంటున్నది. అంత బరువును మోస్తున్న అవ్వని చూస్తే దాని గుండె కలుక్కుమన్నది. తనని పెంచుతున్న అవ్వకి కృతజ్ఞతగా తనూ ఏదో ఒక పని చేయాలనిపించింది దానికి.

తనకు కూడా అడవికి వెళ్ళి కట్టెలు తీసుకురావటం వచ్చు కదా, అని అది అడవికి బయలుదేరింది.

అడవిలో అంతటా పచ్చని చెట్లే కనిపించాయి. ఎండిన మ్రానులైతే ఎక్కడా లేవు- 'మరి ఇంకేం చేయాలి?' అని ఆలోచనలో పడింది ఏనుగు. అంతలో దానికి కంగారుతో కూడిన అరుపులు వినిపించాయి. ఆ అరుపులు వస్తున్న దిశగా పరుగుతీసిందది.

అక్కడ, నది ఒడ్డున ఒక వ్యాపారి నిలబడి ఏడుస్తున్నాడు- 'నా సామాన్లు అన్నీ నీటి పాలయ్యాయి. నాకేమో ఈత రాదు. ఎవరైనా నా సామాన్లు తీసి పెట్టండి. మీ ఋణం ఉంచుకోను' అంటున్నాడు. అయితే అక్కడ ఉన్నవాళ్ళు ఎవ్వరూ వేగంగా పారే నదిలోకి దిగేందుకు సాహసించటం లేదు.

ఏనుగుకు అతన్ని చూస్తే జాలి వేసింది. అది గబుక్కున నీటిలోకి దూకి, ఒక్కటొక్కటిగా అతని సామాన్లన్నిటినీ నదిలోంచి బయటికి తీసి పెట్టింది. వ్యాపారితో పాటు అక్కడున్న వాళ్ళంతా ఆశ్చర్యంగా చూస్తూ నిల్చుండిపోయారు, ఆ వింతను.



ఏనుగు ఒకటి వచ్చి సామాన్లు తీసి పెడుతున్నదనే సరికి వ్యాపారి ఏడుపు ఆగిపోయింది. దానికి తోడు అక్కడ ఉన్నవాళ్లంతా 'ఏనుగుకు ఏదో ఒకటి ఇవ్వు. పాపం అది అంత శ్రమపడింది నీకోసం' అనే సరికి, వ్యాపారి తన సామాన్లు ఎన్ని ఉన్నాయో

అన్ని బంగారు నాణాలను లెక్కపెట్టి ఓ సంచిలో వేసి, ఏనుగు మెడకు కట్టి, దాన్ని సత్కరించి పంపాడు.



ఆ సరికి చీకటి పడుతున్నది. ఏనుగుపిల్ల ఇంకా ఇంటికి రాలేదమని కంగారు పడిన అవ్వ, దాన్ని వెతకటం కోసం అప్పుడప్పుడే పిల్లల్ని పంపబోతున్నది- అంతలోనే ఏనుగు పిల్ల ప్రత్యక్షం అయ్యింది- మెడలో బంగారు నాణాల మూటతో.

ఆ మూటలో అవ్వకొక ఉత్తరం కూడా దొరికింది: 'ఏనుగు గారి యజమానికి- అయ్యా, మీరెవరో నాకు తెలీదు; కానీ మీ ఏనుగు వల్ల నాకు ఈరోజు లక్షలాది రూపాయల నష్టం తప్పింది. అందుకుగాను నేనిచ్చే ఈ చిన్న బహుమతిని స్వీకరించండి. ఇదికాక నానుండి వేరే ఎలాంటి సహాయం కావాలన్నా నేను మీకు చేసిపెట్టేందుకు సిద్ధంగా ఉన్నానని మరువకండి. నన్ను తప్పక సంప్రతించండి" అని.

అన్ని బంగారు నాణాలను అవ్వ ఏనాడూ చూసి ఎరుగదు! ఆ సొమ్ముతో అవ్వ కష్టాలు పూర్తిగా తీరాయి.

అటుపైన ఏనుగు అడవిలో స్వేచ్ఛగా తిరుగుతూ, కష్టాల్లో ఉన్నవాళ్ళకు అందరికీ సాయం చేస్తూ గడిపింది. అంత చక్కని ఏనుగును సాకినందుకు అవ్వ ఎంతగానో గర్వపడింది. ✷

దొరలు దోచలేరు; దొంగలెత్తుక పోరు; భ్రాతృజనము వచ్చి పంచుకోరు
విశ్వవర్ధనంబు విద్యాధనమ్మురా; లలిత సుగుణ జాల తెలుగుబాల!

ఒక రాజేష్-కుందేళ్ల కుటుంబం

బొమ్మకు కథ

రచన: మెండ సుష్మ, తొమ్మిదవ తరగతి, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, నరసన్నపేట, శ్రీకాకుళం జిల్లా.



అనగనగా ఒక అందమైన అడవి. దానిలో దట్టమైన చెట్లు. ఆ అడవి అనేక జంతువులకు, పక్షులకు ఆవాసం. ఆ అడవిలోనే ఒక కుందేలు కుటుంబం ఉండేది- అమ్మ, నాన్న, రెండు పిల్లలు.

ఒక రోజున పెద్ద కుందేళ్ళు రెండూ పిల్లలకు జాగ్రత్తలు చెప్పి ఆహారం వెతుక్కుంటూ వెళ్ళాయి. చిట్టి కుందేళ్ళు రెండూ పొదల చుట్టూ పరుగులెత్తి ఆడుకొని, అలసి సొలసి నిద్రపోయాయి. అవి లేచే సరికి చీకటి పడింది- కానీ పెద్ద కుందేళ్ళు ఇంకా రాలేదు!

చిట్టి కుందేళ్ళకు చాలా భయం వేసింది. అమ్మానాన్నలు వెనక్కి తిరిగి రావటం ఏనాడూ ఇంత ఆలస్యం కాలేదు మరి. అందుకని అవి భయం భయంగానే తల్లిదండ్రులను వెతుకుతూ అడవిలోకి వెళ్ళాయి. అక్కడ వాటికి తెలిసిన జింక ఒకటి కనబడింది. దాన్ని చూడగానే వాటికి ప్రాణం లేచి వచ్చినట్లయింది. అవి రెండూ జింక దగ్గరికి వెళ్ళి "అవ్వా, మా అమ్మా నాన్నలు ఎక్కడైనా కనిపించారా, నీకు? తెల్లవారనగా వెళ్ళారు- ఇప్పటివరకూ రాలేదు. మాకు చాలా భయం వేస్తున్నది" అన్నాయి.

జింక వాటికేసి జాలిగా చూస్తూ "కనిపించారురా, ఇవాళ్ల మధ్యాహ్నం కొందరు వేటగాళ్ళు నా వెంట పడ్డారు. నేను తప్పించుకున్నాను. ఆ సమయంలో మీ

అమ్మానాన్నలు కూడా కనిపించారు నాకు.. వేటగాళ్ల చేతిలో పడ్డారేమో ఏమైనా..ఆ సమయంలో అక్కడ ఓ రామచిలుక కూడా కనిపించింది- మీరు ఇదే దారిలో కొంచెం ముందుకెళ్తే ఆ రామచిలుక ఉండే చెట్టు వస్తుంది. దాన్ని అడగండి, వాళ్ల జాడ తెలుస్తుంది" అన్నది.

చిట్టి కుందేళ్ళు రెండూ రామ చిలుకను వెతుక్కుంటూ ఇంకా లోపలికి వెళ్ళాయి. అవి రామ చిలుక ఉండే చెట్టును చేరుకునేసరికి బాగా చీకటిపడింది. రామచిలుక అన్నది- "అవునమ్మా, నేను చూస్తుండగానే మీ అమ్మానాన్నలు ఇద్దరినీ వేటగాళ్ళు పట్టుకున్నారు. అయితే-ఏడవద్దు-పూర్తిగా వినండి నేను చెప్పేది- వాళ్ల చేతుల్లోంచి మీ నాన్న తెలివిగా తప్పించుకున్నాడు. నేను కలవగానే నాతో 'వేటగాళ్లబారినుండి నా భార్యను తప్పించటంకోసం వాళ్ల వెనకనే వెళ్తాను- ఆమెను వెంటబెట్టుకొని రేపు ఉదయాన్నే వెనక్కి వచ్చేస్తాను , మా పిల్లలు వస్తే జాగ్రత్తగాఉండమని చెప్పు!' అని చెప్పి, ముందుకెళ్ళాడు మీనాన్న. మీరు ఈ పూటకు ఇక్కడే ఉండండి- రేపు ఉదయాన్నే మనం ముగ్గురం వెళ్ళి వాళ్ళని కలుసుకోవచ్చు" అన్నది రామ చిలుక.

చిట్టికుందేళ్ళకు కొంచెం ప్రాణం లేచివచ్చినట్లయింది. ఆ సరికి బాగా అలిసిపోయి ఉన్నాయేమో, వాటికి పడుకోగానే నిద్రపట్టేసింది. ఇంకా తెల్లవారకనే రామచిలుక వాటిని నిద్రలేపింది. మూడూ కలిసి వాళ్ల అమ్మానాన్నల్ని వెతుక్కుంటూ ముందుకు వెళ్ళాయి. కొంత దూరం వెళ్ళేసరికి కుందేళ్ళ నాన్న ఒక్కడే విచారంగా వెనక్కి తిరిగి వస్తూ కనబడ్డాడు వాళ్ళకు. "వచ్చారా, మీ అమ్మను వాళ్ళు ఎవరో వ్యాపారికి అమ్మేశారు. నేను ఆ వ్యాపారిని వెంబడించే వీలు లేకపోయింది. ఇప్పుడామె ఎక్కడున్నదో, ఏమో!" అన్నాడు విచారంగా.

కుందేలు పిల్లలు రెండూ చిలుకతో "నిన్న రాత్రి మాకు ఆశ్రయం ఇచ్చి ఆదుకున్నావు. ఇప్పుడు మరోసాయం చెయ్యి, మా అమ్మ ఎక్కడున్నదో వెతికి పెట్టు, దయచేసి" అని

వేడుకున్నాయి. "అయ్యో, ఆ మాత్రం ప్రయత్నం చెయ్యలేనా? మీరు ఉండండి, పట్నం ఇక్కడికి దగ్గరేగా? నేను అక్కడ వెతికి వచ్చి చెబుతాను" అని ఎగురుకుంటూ పోయింది రామ చిలుక.

అక్కడ, కుందేలును కొన్న వ్యాపారి తన కొడుకు రాజేష్‌కి దాన్ని బహుమతిగా ఇచ్చాడు. రాజేష్ చిన్నతనంలోనే వాళ్లమ్మ చనిపోయింది. అప్పటినుండీ వాళ్ళ నాన్నే రాజేష్‌ని ప్రేమగా పెంచుతూ వస్తున్నాడు. రాజేష్‌కి కూడా వాళ్ల నాన్నంటే చాలా ఇష్టం. వాళ్ళ నాన్న కుందేలును తెచ్చి ఇచ్చాక, రాజేష్‌కి ఒక్క నిముషం కూడా కుందేలును విడిచిపెట్టి ఉండబుద్ధి కాలేదు. ఎప్పుడూ ఆ కుందేలుతోనే ఆడుకోవటం మొదలు పెట్టాడు. కుందేలుని తెచ్చి, తన గదిలో నేలమీద పడుకోబెట్టి, దానికి పళ్ల ముక్కలు పెట్టాడు. తినలేదు. మళ్ళీ "దీనికి ఏం ఇష్టం?!" అని ఆలోచించి, కొన్ని కరివేపాకులు, కొన్ని పోసల గరిక గడ్డి తెచ్చి దాని నోటికి అందించాడు. అయినా తినలేదది. కుందేలు చాలా దిగులుగా ఉంది. రాజేష్‌కి అర్థం అయ్యింది- ఇది బాధ పడుతున్నట్లుంది అని. "ఈ కుందేలు తన కుటుంబాన్ని విడిచిపెట్టి వచ్చింది కదా, అందుకని విచారంగా ఉన్నట్లుంది" అనుకున్నాడు. అప్పుడే వాడికి వాళ్ళ నాన్న చెప్పిన కథ ఒకటి గుర్తుకొచ్చింది. 'సొంతవాళ్లని విడిచిపెడితే, నిజంగానే ఎంత బాధగా ఉంటుందో కదా' అనిపించింది.

"అవునా, నీకు మీ ఇంట్లోవాళ్ళు గుర్తుకొస్తున్నారా?" అని అడిగాడు కుందేలును.

కుందేలును వెతుక్కుంటూ వచ్చిన రామచిలుక ఆ సమయానికి రాజేష్ గది కిటికీలో వాలి అంతా గమనిస్తూ ఉన్నది. రాజేష్ అలా అడగ్గానే అది "అవును అవును" అన్నది ముద్దుగా.

రాజేష్ చటుక్కున తలెత్తి రామచిలుకను చూసి "వీళ్ళ ఇల్లెక్కడో తెలుసా, నీకు?" అన్నాడు.

"తెలుసు తెలుసు" అన్నది చిలుక.

"మరి మమ్మల్ని అక్కడికి తీసుకెళ్తావా?" అడిగాడు రాజేష్.

"అవును అవును" అంది చిలుక.

"నాన్నా, ఈ కుందేలు- పాపం బెంగ పడుతున్నది. దీన్ని తీసుకెళ్ళి వాళ్ల ఇంట్లో వదిలిపెడదాం నాన్నా" అరిచాడు రాజేష్, వాళ్ల నాన్నకి వినబడేట్లు.

"సరేలేరా, ఎప్పుడు వెళ్దాం?" అడిగాడు నాన్న. రాజేష్ దయ, జాలి ఉన్న మంచి పిల్లాడుగా ఎదగటం ఆయనకి ఇష్టమే మరి!

కుందేలు సంతోషంగా నవ్వి, రాజేష్‌కి దగ్గరగా జరిగింది. రామచిలుక "ధన్యవాదాలు" అంది.

రామ చిలుక దారి చూపిస్తుంటే రాజేష్, వాళ్ల నాన్న ఇద్దరూ కుందేలును అడవిలోకి తీసుకెళ్ళి వదిలిపెట్టారు. వెంటనే అది చిట్టి కుందేళ్ళ దగ్గరికి పరుగెత్తింది. చిట్టి కుందేళ్ళు రెండూ సంతోషంగా దాని చుట్టూ గెంతాయి కొద్ది సేపు. అక్కడే నిలబడి చూస్తున్న రాజేష్, వాళ్ల నాన్న వాటిని చూసి ఎంతో ముచ్చటపడ్డారు.

పెద్ద కుందేలు గబుక్కున పోయి రెండు జామపళ్ళు వెతికి తీసుకొచ్చి, రామ చిలుకకు ఇచ్చింది- "ఒకటినీకు-ఒకటి రాజేష్‌కు " అని. ఆ కుందేలిచ్చిన జామపండు ఎంత రుచిగా ఉందో!

దేవుడున్నాడా?!

అమర్: హల్లో ఉదయ్! నాస్తిక సంఘానికి అధ్యక్షుడిగా ఎన్నికయ్యావట కదా, కంగ్రాట్స్!

ఉదయ్: ఏదోలేరా, అంతా దేవుడి దయ!

ఎవరో ఒకరు!


తండ్రి: నేను చిన్నతనంలో చిత్తు కాగితాలు ఏరుకొని లక్షాధికారిని అయ్యాను తెలుసా?

కొడుకు: మంచిపని చేశావు నాన్నా! లేదంటే ఇప్పుడు ఆ పని నేను చేయాల్సి వచ్చేది.

ఒంటె-కుందేలు

బొమ్మల కథ

రచన: కె. జానకి, ఉపాధ్యాయురాలు, జి.ప్ర.ప. సెకండరీ పాఠశాల, తరాలపల్లి, వరంగల్లు జిల్లా



అనగనగా ఒక ఎడారిలో ఒక ఒంటె ఉండేది. ఒక రోజు మధ్యాహ్నం. అది దప్పిక తీర్చుకోవడానికి ఒక కొలనుకు వెళ్ళింది. అది తిరిగి వచ్చేటప్పుడు దాని కాలికి ఒక పదునైన ముల్లు గుచ్చుకుంది. బాధతో అది అరిచింది. ముల్లు తీసుకోవడానికి ప్రయత్నించింది. దాని వల్ల కాలేదు. అప్పుడే అక్కడకు ఒక కుందేలు వచ్చింది.





కుందేలు ఒంటె బాధ చూసి జాలి పడింది. మెల్లగా దాని దగ్గరకు వెళ్ళి ముల్లు తీసివేసింది. ఒంటె కుందేలుకు కృతజ్ఞతలు తెలిపింది.



కొన్నాళ్ళు గడిచాయి. కుందేలు ఒక బొరియ తవ్వుతూ ఉంది. హఠాత్తుగా ఒక నక్క అక్కడికి వచ్చింది. కుందేలు మీద దాడి చేయడానికి ప్రయత్నించింది. నక్కను చూసి కుందేలు భయంతో కేకలు పెట్టింది.

అప్పుడు ఆ దారి వెంట ఒంటె వెళుతూ ఉంది. కుందేలు అరుపులు విని అది త్వరగా దాని దగ్గరకు వచ్చింది. కుందేలును పైకి ఎత్తి మెల్లిగా తన వీపు మీద కూర్చోబెట్టుకుంది.





ఒంటెను చూసి హడలెత్తి నక్క పారి పోయింది. కుందేలు ఒంటెకు కృతజ్ఞతలు చెప్పింది. ఆరోజు నుండి కుందేలు, ఒంటె మంచి స్నేహితులుగా కలిసి మెలిసి జీవించాయి.

పద్యం

క్రూరమనస్కులౌ పతులగొల్చి వసించిన మంచివారికిన్
వారిగుణంబెపట్టి చెడువర్తన వాటిలు; మాధురీ జలో
ధారలు గౌతమీ ముఖమహానదు లంబుధి గూడినంతనే
క్షారముజెందవే మొదలి కట్టడలన్నియు దప్పి భాస్కరా?

భావం: తియ్యటి నీళ్ళతో కూడిన గొప్ప గొప్ప నదుల నీళ్ళన్నీకూడా అవి ఒకసారి సముద్రంలో కలిసాక ఏమవుతాయి? ఉప్పు నీళ్ళు ఐపోతాయి కదా, అట్లాగే దుర్మార్గులైన యజమానుల దగ్గర పనిచేసే మంచివాళ్ళకు కూడా వాళ్ళ గుణాలే అబ్బుతాయి. అందుకని జాగ్రత్తగా ఉండాలి. మనలోని మంచిగుణాలను కాపాడుకోవాలి.

బొమ్మకు కథ రాయండి!

నిర్వహణ: కొత్తపల్లి

ఈ బొమ్మను చూడండి:



కుండలమ్మా, కుండలు! ఈ కుండల్ని ఎవరు పేర్చారో, ఇట్లా? వీటినే కొంచెంసేపు చూస్తూ ఉండండి- మీ మనసుల్లో ఏదో కథ తప్పక మెదలుతుంది. ఆ కథని మాకు రాసి పంపండి! బాగున్న కథని కొత్తపల్లి కథల పుస్తకం-63 లో ప్రచురిద్దాం!

మా చిరునామా తెలుసుగా? కొత్తపల్లి, యంఆర్వో ఆఫీసు దగ్గర, చెన్నేకొత్తపల్లి, అనంతపురం జిల్లా- 515101 ఫోను: 08559240222, 7702877670, ఇ-మెయిలు: team@kottapalli.in



వ్యక్తిత్వం

రచన: రాధ మండువ, ఉపాధ్యాయిని, రిషీవ్యాలీ స్కూలు, రిషీవ్యాలీ, చిత్తూరు జిల్లా.

రాజుకి ఆరేళ్ళ వయసున్నప్పుడు వాళ్ళ నాన్న శ్రీనివాస్‌కి అమెరికాలో ఉద్యోగం దొరికింది. దాంతో వాళ్ళు అమెరికాకి వెళ్ళిపోయారు.

రాజు పెరిగి పెద్దవాడవుతున్నాడు. ఎప్పుడూ పుస్తకాలు చదువుకుంటూ ఇంట్లోనే ఉండేవాడు. ఇంటి ఎదురుగా ఉన్న పార్కులో పిల్లలు ఆడుకోవటాన్ని కిటికీలో నుండి చూస్తూ ఉండేవాడు; కానీ వెళ్ళి వాళ్ళతో ఆడుకునేవాడు కాదు. వాళ్ళ అమ్మ పద్మ వాడిని ఆటలకు తీసుకెళ్ళినా, వాడు అమ్మ దగ్గరే కూర్చుని ఆటలు చూస్తూ ఉండేవాడు. స్కూల్ పిల్లలతో కూడా పెద్దగా కలిసేవాడు కాదు. అందువల్ల 'వాడికి పుస్తకాలు చదువుకోవడంలోనే ఆనందం ఉందిలే-' అనుకునేది పద్మ.

రాజుకి పన్నెండు సంవత్సరాలు వయసున్నప్పుడు, వాళ్ళంతా ఇండియాకి తిరిగి వచ్చేశారు. రాజు ఇక్కడి స్కూల్లో

చేరనైతే చేరాడుగానీ, ఇక్కడ కూడా తోటి పిల్లలతో పెద్దగా కలిసేవాడు కాదు. అయితే ఇప్పుడు వాళ్ల ఇంటికి చాలా మంది బంధువులు, వాళ్ళ పిల్లలు వస్తూ పోతూ ఉండేవాళ్ళు. దగ్గరి బంధువుల పిల్లలు సెలవల్లో ఒంటరిగా వచ్చి, నాలుగైదు రోజులు ఉండి వెళ్తూండేవాళ్ళు. రాజుని కూడా వాళ్ళ ఇళ్ళకి పంపమని అడిగేవారు. 'రాజు ఎవరింట్లోనూ ఉండలేడు' అని అనుకుని, పద్మ వాడిని ఎవరింటికీ వెళ్లనిచ్చేది కాదు.

శ్రీనివాస్ ఎన్నోసార్లు రాజుని ఒంటరిగా తన అన్నయ్య ఇంటికి పంపాలని ప్రయత్నించాడు. కాని ఎప్పుడూ 'రాజు మనస్తత్వం తనకే తెలుసు' అన్నట్లుగా మాట్లాడేది పద్మ. వాడిని ఎక్కడికీ పంపేది కాదు.

చూస్తూండగానే రాజు తొమ్మిదవ తరగతి పూర్తి చేశాడు. అంతవరకూ వాడు ఒంటరిగా ఎక్కడికీ ప్రయాణం చేయడం కానీ, ఎవరి ఇంట్లోనూ ఉండటం కాని జరగలేదు. ఆ వేసవి సెలవల్లో శ్రీనివాస్ వాళ్ళ అన్న కొడుకు చందు వచ్చాడు, వాళ్ళింటికి.

"పిన్నీ! ఎప్పుడూ నేనే మీ ఇంటికి వస్తున్నాను. రాజుని మా ఇంటికి పంపమని ఎన్ని సార్లు అడిగినా మీరు పంపట్లేదు. ఎందుకు? మేం రాజుని సరిగా చూసుకోమని మీకు అనుమానమా?" అని అడిగాడు వాడు పద్మని.



"ఛ! అదేం కాదురా చందూ! మమ్మల్ని వదిలిపెట్టి ఒంటరిగా ఎవరింటికైనా వెళ్ళటం అంటే రాజుకి ఇష్టం ఉండదు. వాడు ఇబ్బంది పడతాడు. అందుకనే, నేను వాడిని ఎక్కడికీ పొమ్మని బలవంతం చేయనిది" అంది పద్మ.

"అవునా రాజూ! ఎందుకురా, నీకు ఇబ్బంది?

మన కజిన్ పెళ్ళి ఈ నెల 25 న కదా! మనిద్దరం వారం ముందే వెళదాం. అక్కడ నీకు ఎంతో సరదాగా ఉంటుంది. నేను ఉంటానుగా, నీ వెంట! వెళదామా?" అన్నాడు వాడు, ప్రక్కనే ఉన్న రాజుతో.

"వెళతావా రాజూ?" అని అడిగాడు శ్రీనివాస్.

'వెళ్ళను' అని అంటాడని ఎదురు చూస్తున్న పద్మకి ఆశ్చర్యం వేసేట్లు, 'వెళతాను నాన్నా!' అనేశాడు రాజు. ఆశ్చర్యంతో కళ్ళప్పగించి చూస్తూ ఉండిపోయింది పద్మ.

పెళ్ళిలో అత్తలు, మామయ్యలు, పిన్నులు, బాబాయిలు, వాళ్ళ పిల్లలు అందరూ రాజుని ఎంతో ఆప్యాయంగా పలకరించారు. వాడు కూడా ఆ వారం రోజులూ అక్కడ ఎంతో సరదాగా గడిపాడు. పెళ్ళి సమయానికి అక్కడికి చేరుకున్న పద్మకూడా అక్కడ రాజు అందరితో చనువుగా, సంతోషంగా మెసలడం చూసి సంతోషపడింది. కొడుకు వైపుకు ఆనందంగా చూసింది.

"చూశావా! నేను చెప్తుంటే విన్నావు కాదు. 'వాడికి ఇష్టం ఉండదు ' అని అనుకున్నావే గాని, 'పిల్లలు పెద్దయ్యే కొద్దీ మారతారు' అని గ్రహించలేకపోయావు " అన్నాడు శ్రీనివాస్ పద్మతో.



'మంచి వ్యక్తిత్వాలు ఏర్పడాలంటే స్వేచ్ఛగా నలుగురితో కలిసి మెలిసి తిరగాలని నాకూ తెలుసు. అయితే, తెలిసి కూడా 'ఏమవుతుందో' అన్న భయంకొద్దీ వాడిని నేను ఎదగనివ్వలేదేమో! ఇప్పటికైనా తెలుసుకున్నాను, మంచిదైంది!' అందరితో మాట్లాడుతూ కలివిడిగా తిరుగుతున్న రాజుని చూస్తూ సంతోషంగా అనుకుంది పద్మ.



నీవు నేర్పిన విద్యయే ...

"నేను చేసిన ఈ పనే రేపు నా కొడుకు కూడా నాపట్ల చేస్తాడు" అంటూ గాయత్రిగారు రాసి పంపిన ఈ కథ, ముసలివాళ్లపట్ల మనకు ఉండాల్సిన బాధ్యతను గుర్తుచేస్తున్నది.. చదవండి.

కథనం: గాయత్రి దేవి, తెలుగు ఉపాధ్యాయిని, 'స్లేట్- ద- స్కూల్, అమీర్‌పేట, హైదరాబాద్

కాకినాడ టౌన్ లో ఉంటారు కమలాకర్, అతని భార్య రమ, వాళ్ల ఆరేళ్ళ కొడుకు అనిల్.

కమలాకర్ సొంత ఊరు గేదెల్లంక. అక్కడ, పల్లెలో ఉండేవాళ్ళు వాళ్ల అమ్మా నాన్నలు. అయితే వయసు పెరుగుతున్నకొద్దీ వాళ్ల ఆరోగ్యం క్షీణిస్తూ వచ్చింది. పల్లెలో వైద్య సౌకర్యాలు, అవీ సరిగా లేవని, తల్లితండ్రులను కూడా కాకినాడలోని తన ఇంటికే వచ్చేయమన్నాడు కమలాకర్.

వేళకు మందులు వేసుకోవడం వల్ల, చిన్నారి మనవడి కబుర్లతో కాలక్షేపం అవ్వటంవల్ల పెద్ద వాళ్ళిద్దరి ఆరోగ్యం బాగా మెరుగయ్యింది.

ఆ తర్వాత కొద్ది రోజులు బాగానే గడిచాయి.

అయితే క్రమేణా రమకు ప్రశాంతత తగ్గసాగింది. కోడలికి అత్తమామలు అడ్డుగా అనిపించసాగారు. పట్నంలో గొప్పగా బ్రతికే తమ తోటివాళ్ళకు ముతక మనుషుల్లా ఉన్న అత్త మామలను పరిచయం చేయటం ఇబ్బందిగా అనిపించసాగింది.

అందుకని కమలాకర్, రమ మాట్లాడుకొని ముసలివాళ్ళిద్దరినీ ఊరు చివరన ఉన్న వృద్ధాశ్రమంలో చేర్పించారు.

అప్పటి దాకా తమతో ఉంటూ, తనకు ఎన్నో కథలు, కబుర్లు చెప్పే తాతయ్య-మామ్మ దగ్గరగా లేక పోవడం చిన్నారి అనిల్‌కి చాలా బెంగగా అనిపించింది. సెలవప్పుడు, సాయంత్రం పూట ఒక్కసారి మటుకు తనని బామ్మ-తాతయ్యల దగ్గరకి తీసుకుని వెళ్తున్నారిప్పుడు. వాడు చూసి చూసి- "అమ్మా! తాతయ్య వాళ్ళు ఇప్పుడు మనతో ఎందుకు రారు?" అని అడిగేశాడు తల్లిని.

తల్లికి ఏం చెప్పాలో తోచలేదు- "పెద్ద వారు కదా, వాళ్ళకి అక్కడే హాయిగా, సుఖంగా ఉంటుందిరా, కన్నా" అని సమాధానం చెప్పింది.

చూస్తుండగా కొన్ని నెలలు గడిచాయి.

ఒక రోజు పిల్లాడిని తీసుకుని భార్యా భర్తలు ఇద్దరూ సముద్రపు ఒడ్డుకి వెళ్ళారు. అక్కడ తమ చిన్నారి కొడుకు కట్టుకునే ఇసక గూళ్ళని చూసి దంపతులు ఇద్దరూ మురిసి పోసాగారు.



చిన్నారి కొడుకు తన ఇసుక గూళ్ళలోని ఒక్కొక్క గదినీ గర్వంగా చూపిస్తున్నాడు- 'ఇది నాది, ఇది వాళ్ళది, వీళ్ళది'అని. రమ వాడిని అడిగింది మురిపెంగా- "ఏరా, మరి మా గది ఏదిరా?" అని. "అవునవును- మా

గది ఏదిరా?" అడిగాడు కమలాకర్.

"మరి మీరు ముసలిగా అవుతారు కదా, అప్పుడు తాత మామ్మల్లాగ మీకు కూడా వృద్ధాశ్రమమే బాగుంటుంది కదా! మా ఇంట్లో మీకు గది ఉండదు" టక్కున సమాధానం చెప్పాడు అనిల్. రమకు ఈ మాట చెంప దెబ్బలా అనిపించింది. కమలాకర్రావుకు తను చేసిన తప్పు ఏమిటో తెలిసింది.

మరుసటి రోజు ఉదయాన్నే "తాతయ్యకు, మామ్మకు అక్కడ బాగోలేదటరా, కన్నా. నువ్వు లేక, వాళ్ళకి అక్కడ అస్సలు తోచటల్లేదుట. అందుకని మనం మన తాతయ్యని, మామ్మని మన ఇంటికే తెచ్చుకుందాం" అంటూ వాహనాన్ని బయటకు తీసాడు కమలాకర్.

ఎప్పటికెయ్యది ప్రస్తుత
మప్పటికా మాటలాడి యన్యుల మనముల్
నొప్పింపక తా నొవ్వక
తప్పించుకు తిరుగువాడు ధన్యుడు సుమతీ !

సమయానికి తగినట్లు, ఎక్కువ తక్కువ
కాకుండా మాట్లాడి, ఇతరుల మనస్సుకు
నొప్పి కలగకుండా, తనకు బాధ కలగకుండా
తప్పించుకు తిరిగేవాడు ధన్యుడు!

ఓడల బండ్లును వచ్చును
ఓడలు నా బండ్లమీద నొప్పుగ వచ్చున్
ఓడలు బండ్లును వలనే
వాడంబడు గలిమిలేమి వసుధను సుమతీ !

ఓడల మీద బళ్ళు వస్తుంటాయి; ఒక్కోసారి
బళ్ళ మీద ఎక్కి ఓడలూ వస్తుంటాయి. వీటి
లాంటివే, మనకు వచ్చే సుఖం- కష్టం.
అవి కూడా ఒకదాని మీద ఒకటి వస్తూ ఉంటై.

సుమతీ!



ఉమ్మేస్తే మంటలు

రచన: ఎస్. శంకర శివ రావు, ఉపాధ్యాయుడు, ఇంద్రజాలికుడు, రాష్ట్ర సచివుడు-జనవిజ్ఞాన వేదిక.

అనంతపురం జిల్లాలో ప్రపంచ ప్రసిద్ధి గాంచిన "తిమ్మమ్మ మర్రిమాను"కు ఆమడ దూరంలో ఉంది- "పాలేగాళ్ళ కాలం" నాటి "కొక్కంటి" సంస్థానపు పురాతన కోట. ఆ కోటలో నిధులున్నాయని అందరూ అనుకుంటూ ఉంటారు. నిధుల కోసం ఎవరెవరో ఎక్కడెక్కడో త్రవ్వకాలు జరుపుతూనే ఉంటారు ఈనాటికీ.

అదే ఊరిలో ఉన్నాడు పెదకోమటి శేషయ్య. ఆయన, ఆయన భార్య ప్రమీల వడ్డీ వ్యాపారం చేస్తుంటారు. ఇద్దరూ పేరొందిన ఆశపోతులు! తమకు లాభం ఉండదంటే ఎవ్వరికీ ఒక్క మెతుకు కూడా వేసి ఎరుగరు.

మెడలో రుద్రాక్షలు, చేతిలో కమండలం, కాషాయ వస్త్రాలు ధరించిన సాధువు ఒకడు జడలు కట్టిన తలతో సాగిపోతున్నాడు

కొక్కంటి పురవీధుల్లో. 'ఎవరినీ బిక్షం అడగడు. తనకు తోచిన ఇంటి ముందు ఆగి భిక్షం స్వీకరిస్తాడు. ఆయన భిక్ష స్వీకరించిన వాళ్లకు ఇక పండగే పండగ' అని పుకారు ఆయనకంటే ముందుగా అందరినీ చేరుకుంటున్నది. శేషయ్య-ప్రమీల దంపతుల నూ చేరింది ఈ విషయం. 'సాధువు ఈ దారిన ఎప్పుడు వస్తాడా, మా ఇంటి గడప ఎప్పుడు తొక్కుతాడా' అని వేచి చూస్తున్నారు వాళ్ళిద్దరూ. ఆ శుభ ఘడియ రానే వచ్చింది- సాధువు నేరుగా వాళ్ళ ఇంటికే వచ్చాడు- 'రండి స్వామీ' ఆహ్వానించాడు శేషయ్య.

సాధువు శేషయ్య ఇంటిని పరీక్షగాచూసాడు. కొంత సేపటికి - 'నా వాక్కు బ్రహ్మ వాక్కు. నేను ఉమ్మేస్తే గడ్డి భగ్గున మండి పోతుంది. నా మాటకు తిరుగు లేదు. నీకు ధనయోగం ఉంది! తాతగార్లు దాచిన ముల్లెలు నీ ఇంట్లోనే మూలుగుతున్నాయి. వాటిని తీసి ఇస్తాను. ధనవంతుడవు కమ్మురా, పెద్ద కోమటీ!' గంభీరంగా పలికాడు సాధువు.

శేషయ్య దంపతులు నిశ్చేష్టులయ్యారు. 'నా మీదే శంకగా ఉందిరా మీకు? చూడరా నా మహిమ!' అంటూ గేదె ముందు వేసి ఉంచిన ఎండు గడ్డి మీద ఉమ్మేసి, కొంత సేపు ఏవేవో మంత్రాలు చదివాడు స్వామి.



అంతే- వరి గడ్డి భగ్గుమని మండింది! క్షణాల్లో ఆ మంటలు వ్యాపించటం మొదలు పెట్టాయి! భయంతో గేదె తాడు తెంపుకుని పారిపోయింది. "చూసితివిగా, ఇంకా శంకిస్తావురా?!" తీక్షణంగా చూశాడు సాధువు.

"క్షమించండి స్వామీ!" అంటూ కాళ్ళ మీద పడ్డారు దంపతులిద్దరూ.

క్షమించినట్లు వాళ్ళను లేవదీసాడు సాధువు. "పూజకు సిద్ధం చెయ్యరా! ధనం ఎక్కడుందో చూపుతాను!" అంటూ అక్కడే ఉన్న చెక్క కుర్చీ మీద కూర్చున్నాడు.

తర్వాతి అరగంటలో నట్టింట ముగ్గు వెలసింది- నిమ్మకాయలు, పసుపు కుంకుమలతో సహా. తన బ్యాగులో నుండి "మాయా దర్పణి" తీశాడు స్వామి. నల్లటి పదార్థం ఏదో పూసిన అద్దంలాగా ఉంది అది. దానిలోకి చూస్తూ, కొద్ది సేపు "ఓం! భీం! హ్రీం! జై మహంకాళి! రక్ష రక్ష!" అని అరిచి, "కనిపించిందిరా, ధనం! పెద్ద రాగి బిందెలో దాచినారురా!" అన్నాడు సాధువు సంతోషంగా.

"ఎక్కడ స్వామీ?" ఆతృతగా అడిగాడు శేషయ్య.

"చూడరా, కోట గోడ తూరుపు దిక్కున వున్న చిన్న సత్రంలోని నంది విగ్రహం క్రింద! అది నీదేరా, పెద కోమటి! దాన్ని తీసి నీకు ఇస్తానురా! నీవు ఇక ఐశ్వరవంతుడివిరా!" అన్నాడు సాధువు నవ్వుతూ.

"అంతా తమరి దయ. ఎప్పుడు తీస్తారు స్వామీ?" అడిగాడు శేషయ్య, ఆత్రంగా.

"వచ్చే అమావాస్య నాడు తీద్దాం. అంతా సిద్ధం చేసుకో!" అంటూ గబ గబ వెళ్ళిపోయాడు సాధువు.

శేషయ్య దంపతులు ఎదురు చూస్తున్న అమావాస్య రానే వచ్చింది. స్వామి కోసం ఎదురు చూపులు మొదలయ్యాయి. రాత్రి పది గంటలకు, బలిష్ఠంగా ఉన్న శిష్యులు ఇద్దరిని వెంటబెట్టుకొని వచ్చాడు సాధువు. సాధువు పాదాలకు నమస్కరించాడు శేషయ్య. "స్వామీ- మరి వీళ్ళు?" అనుమానంగా అడిగాడు- శిష్యులను ఉద్దేశించి.

"వీళ్ళు మన వాళ్ళే. నమ్మకమైన శిష్యులు. ఇలాంటి కార్యాలు చేయడంలో దిట్టలు" పలికాడు సాధువు. "అంతా సిద్ధం చేశావుగా!" అని అడుగుతూ.

"సిద్ధమే" అని తలూపాడు శేషయ్య.

రాత్రి పన్నెండు గంటల సమయానికి సత్రం దగ్గరున్న నంది విగ్రహం దగ్గరికి చేరారు

అందరూ. బుడ్డిదీపం వెలుగులో తవ్వకం మొదలైంది. తవ్వుతుంటే మన్ను మెత్తగా వస్తున్నది. "అదృష్టం పండిందిరా! సులువుగా త్రవ్వకం జరుగుతున్నది!" అన్నాడు సాధువు.



"అంతా తమరి దయ, నా భాగ్యం" అన్నాడు శేషయ్య సంతోషంగా.

రెండు అడుగుల లోతు తవ్విన తరువాత గునపం తగిలి 'ఠంగ్' అన్న శబ్దం వచ్చింది.

సాధువు, లేచి నిలబడి. అక్షింతలు తీసుకుని గోతిలో చల్లాడు. టెంకాయలు, పూలు, సమర్పించాడు శేషయ్య. "నిధి ఉన్న బిందె శబ్దంరా అది! చిన్నగా త్రవ్వకం చేయండి. ఇక చేతితో మట్టి తీయండిరా" ఆజ్ఞాపించాడు సాధువు.

శిష్యులు చేతులతో మట్టిని తోడసాగారు. అంతలో మూసి ఉన్న ఓ రాగి బిందె మూతి కనిపించింది గుంత అడుగున!

"ఆగండి! దానిని ముందుగా శేషయ్య చేతితో తీయాలి!" అన్నాడు సాధువు.

"అలాగే స్వామీ!" అంటూ తప్పుకున్నారు శిష్యులు.

శేషయ్య గోతిలోకి దిగి, బిందె మీద వున్న మట్టిని చేతితో ప్రక్కకు నెట్టేసి, బిందెను పైకి ఎత్తబోయాడు.

"బరువు ఎక్కువ ఉన్నది. సాయం పట్టండిరా" అన్నాడు సాధువు.

అందరూ తలా ఒక చెయిా వేసి బిందెను బయటికి తీసారు.

"చాలా ధనం ఉంది. దీనిని ఇంటికి తీసుకు పోదాం, పదండి" అంటూ ఇంటికి తీసుకెళ్ళారు.

లోపలి గదిలోకి వెళ్ళి లాంతరు దీపంలో

చూశారు బిందెను. సీసంతో సీలు చేయబడిన బిందె అది. "దాని నిండా ధనం ఉన్నది. అందుకే బరువు ఎక్కువగా ఉంది" అన్నాడు సాధువు. "దీనిని పూజా గదిలో ఉంచి, వారం రోజులు "ధనలక్ష్మి" పూజ చేయాలి. ఏమైనా తేడా వస్తే అంతా బొగ్గులు, రాళ్ళు అయిపోతాయి! జాగ్రత్త!" హెచ్చరించాడు సాధువు. "నాకు ప్రతిఫలంగా ఇప్పుడే కొంత బంగారం ఇవ్వండి. వారం రోజుల తరువాత నేను ఎక్కడ ఉంటానో ఏమో!" అని జోడిస్తూ.

"తమరి ఋణం ఉంచుకుంటామా, స్వామీ" అంటూ భార్య నగలు, తన నగలు తెచ్చి ఇచ్చాడు శేషయ్య.

"అంతేనా, మణుగు బంగారం తీసి ఇస్తే- ఇదా, నాకు దక్కేది?!" అన్నాడు సాధువు.

"మొత్తం 30 సవరాల నగలు ఇవి. వీటిని స్వీకరించండి స్వామీ, తరువాతనైనా, తమరి రుణం ఉంచుకోం" అన్నాడు శేషయ్య.

"సరే"నంటూ ఆ నగలతో వెళ్ళిపోయాడు సాధువు.

వారం రోజులు ఒక యుగంలా గడిచింది శేషయ్య దంపతులకు. వారం కాగానే బిందెకు ఉన్న సీలును తెరిచారు. బిందెలో బంగారు లేదు, వజ్రాలు లేవు- నిండా బొగ్గులు, ఇనుప కడ్డీలు ఉన్నాయి!

గుండెలు బాదుకున్నారు దంపతులు. "పూజలో ఏదో లోపం జరిగి ఉంటుంది. అందుకే అవి అలా అయిపోయాయి" అన్నది ప్రమీలమ్మ.



"కాదు, కాదు! దీనిలో ఏదో మోసం ఉంది. వాళ్ళు నిజమైన స్వాముల్లా లేరు. మనకు మోసం జరిగిపోయింది" అంటూ ఏడ్వ

సాగాడు శేషయ్య. "నా ముప్పై సవరాల బంగారం ఎత్తుకెళ్ళారు మోసగాళ్ళు" అని ఏడుపు లంకించుకుంది ప్రమీలమ్మ.

పక్కవాళ్ళు పరుగెత్తుకొని వచ్చారు. "పోలీసులకు ఫిర్యాదు చేయండి" అన్నారు.

S.I. గారితో జరిగిన సంగతి అంతా పూస గుచ్చినట్లు చెప్పాడు శేషయ్య- "సార్! నేను ఇప్పటికీ నమ్మలేక పోతున్నాను. అతను ఉమ్మేస్తే గడ్డి మండుతుంది" అని.

"అదా, సంగతి. అది ఒక మ్యాజిక్. నేనూ చేయగలను" అన్నాడు S.I.రాథోడ్.

"మ్యాజిక్కా ?!" నోరు వెళ్లబెట్టాడు శేషయ్య. S.I.రాథోడ్ ఆఫీసునుండి ఓ సీసాని తెప్పించాడు. సీసాలో నీళ్ళలో మునిగి ఉన్నది, ఏదో పసుపు పచ్చని పదార్థం. చెప్పాడు- "ఈ సీసాలో ఉన్నది చూడండి- ఇది భాస్వరం. దీనికి మండే స్వభావం ఉంది. నీళ్లలో ఉన్నంత సేపు ఏమీ అవదు. నీళ్లలోంచి నుండి బయటికి తీసిన తరువాత దీని మీద ఉన్న తేమ ఆరిన వెంటనే మండి పోతుంది" అన్నాడు.

కొంత భాస్వరం తీసి గడ్డి మీద వేసాడు. అది వేశాక కొంత సేపటికి ఆ గడ్డికాస్తా భగ్గున అంటుకుంది.

"వాడు నోటితోనే ఉమ్మి వేసాడు సార్!" అన్నాడు శేషయ్య.

"అదా నీ అనుమానం! ఇక చూడు!" అంటూ కొంత భాస్వరం తీసుకుని నోట్లో నాలుక కింద వేసుకున్నాడు S.I. "దీనిని మనకు కావలసిన వాటి మీద ఉమ్మేయాలి. దానిలోని తేమ ఆరిన తరువాత అది మండుతుంది!"

"మరి మనకు ప్రమాదం కాదా?" అడిగాడు శేషయ్య.

"నిజానికి భాస్వరం విషపదార్థమే. దీనిని మింగకూడదు. అయితే దీన్ని నాలుక క్రింది భాగంలో దాచుకొని, వీలైనంత త్వరగా ఉమ్మేసి నీళ్ళు పుక్కిలిస్తే మనకు ఏమీ అవ్వదు" చెప్పాడు S.I, దాన్ని మరోచోట ఉమ్మేసి మంటలు సృష్టిస్తూ.

"ఎంత మోసం జరిగి పోయింది" అంటూ మళ్ళీ ఏడ్చాడు శేషయ్య. "జీవితమంతా

కష్టపడ్డాను సార్" అన్నాడు.

"వడ్డీ వ్యాపారంతో పేదలను పీడించావు. అందుకే నీకు తగిన శాస్తి జరిగింది" అన్నాడు S.I. "చూడు శేషయ్యా, పురాతన ఆలయాలను, కోటలను, విగ్రహాలను పాడు చేయడం పెద్ద నేరం. దీనికి నిన్ను జైలులో వేయాలి. కాని మొదటి తప్పుగా వదిలేస్తున్నాను. నువ్వు ఇక వెళ్ళు. నేను ఆ దొంగ సాధువు పని చూసుకుంటాను" అని శేషయ్యను తిట్టి పంపిస్తూ.

"మూఢ నమ్మకం, అత్యాశ, పిసినారితనం నా కొంప ముంచాయి. ఇక నుండి నిజాయితీగా బతుకుతాను. నన్ను క్షమించండి" అంటూ తల వంచుకొని ఇంటిదారి పట్టాడు శేషయ్య.

నవ్వండి!

మరోటి!

టీచర్: ఉభయచరజీవికి ఒక ఉదాహరణ చెప్పమ్మా, కావ్యా?

కావ్య: కప్ప

టీచర్: మరి ఇంకో ఉదాహరణ చెప్పు!

కావ్య: ఇంకో కప్ప!

నోరు తెరు!

చింటూ: అరేయ్ బంటీ! మా టీచర్‌కి దేవుడంటే చాలా ఇష్టంరా!

బంటీ: నీకెలా తెలుసురా?

చింటూ: నేను ఏం చెప్పినా 'ఓ మై గాడ్!' అని ఆశ్చర్యపోతుంటుందిరా, మరి!

చక్కని పేరు!

లిల్లి: మా పిల్లికి దాని పేరు పలకటం వచ్చు, తెల్సా?!

పింకీ: వావ్! నిజమా! ఏంటి దాని పేరు?

లిల్లి: మ్యావ్ మ్యావ్.

కోటికి పడగ

సామెత ఎలా వచ్చింది?

సేకరణ: శ్రీపురేందర్, ఉపాధ్యాయులు, తరాలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, హన్మకొండ.

డబ్బున్నవాళ్ళకు గౌరవం దక్కటం అనేది సంఘంలో ఇప్పటి అలవాటే కాదు- ఎప్పటి నుండో వస్తున్న రివాజు కూడాను. ధనికులకు సంఘంలో గౌరవం, పలుకుబడి ఏనాడూ అధికంగానే ఉన్నాయి. దాంతో ప్రతి మనిషీ డబ్బును సంపాదించేందుకు, దాన్ని నిల్వ చేసేందుకు తాపత్రయ పడుతూ వస్తున్నాడు- అలా డబ్బుకున్న విలువను పెంచుతున్నాడు కూడా!

ఈ రోజుల్లోనైతే డబ్బును వెల్లడి చేసుకునేందుకు అనేక మార్గాలున్నాయి. అయితే పాత కాలంలో ఇలా అనేక మార్గాలు ఉండేవి కావు. ధనాన్ని నిల్వ చేసి బాగా ధనవంతులైనవాళ్ళు 'మా దగ్గర ఇంత డబ్బు ఉంది తెలుసా?' అని గర్వంగా ప్రకటించుకోవటానికి పూర్వకాలంలో ఒక ఆచారం ఉండేది.

ఆ రోజుల్లో బంగారు నాణాలను టంకాలు అని పిలిచేవాళ్ళు. ఎవరైనా కోటి టంకాల ధనవంతులైతే, ఆ సంగతిని చాటి చెప్పుకునేందుకు గాను ఒక శివలింగానికి నాగాభరణం చేయించి, వేడుకగా పూజించి, ఊళ్ళో వాళ్లందరినీ పిలిచి భోజనాలు పెట్టేవాళ్ళు. అట్లా ఎన్ని కోట్ల టంకాలను సంపాదిస్తే అన్ని శివలింగాలు- అన్ని నాగాభరణాలు! దాన్ని బట్టి ఆ వ్యక్తి దగ్గర ఎన్ని కోట్ల ధనం ఉందో అందరికీ తెలిసేది; ప్రజల్లోను, అధికారుల్లోను, జమీందారీలోను, రాజుల దగ్గరా ఆ వ్యక్తికి అంత గౌరవం లభించేది.

పడగ ఎత్తి నిల్చున్న నాగాభరణాన్ని శివలింగానికి అమర్చి పూజించటం, ఆ శివలింగాన్ని తాము సంపాదించిన కోటి టంకాలపైన స్థాపించటం- దీంతో 'కోటికి పడగ' అనే సామెత మొదలైంది. ఎవరైనా చాలా ధనం సంపాదిస్తే- "వాళ్ళకేమిరా, కోటికి పడగ ఎత్తారు" అనసాగారు. ఇప్పుడు ఆ నాగాభరణాలూ లేవు, శివలింగాలూ లేవు- సామెత మాత్రం అలాగే ఉండిపోయింది!



దురాశ పిల్లి

తమ పిల్లలు పెద్దయ్యాక తమను మించిపోవాలి అనుకోనని తల్లిదండ్రులెవరు? 'అయితే అందులో ప్రమాదం ఉంది-జాగ్రత్త' అని హెచ్చరిస్తున్న ఈ కథని చదవండి.. ఆలోచించండి!

రచన: డా.నీరజ అమరవాది, ష్రేవెపోర్టు, లూసియానా.

ఒక ఊళ్లో 'అమిత' అనే పిల్లి ఒకటి ఉండేది . పేరుకు తగ్గట్టు, దానికి చాలా ఆశలు ఉండేవి . అందరి ఇండ్లలోనూ దూరి, అది దొంగతనంగా పాలు-పెరుగు తాగేసేది. అప్పుడప్పుడూ తనకు కనిపించిన ఎలుకలను కూడా పట్టుకునేది .

ఒక సారి 'అమిత'అట్లా తిరుగుతూ, తిరుగుతూ అనుకోకుండా ఊరు దాటి అడవిలోకి వెళ్ళింది. ఎప్పుడూ అడవిని చూడలేదు కదా, అందుకని దానికి ఆ అడవి చాలా నచ్చింది . అటూ , ఇటూ పరిగెత్తుతూ అడవి అంతా కలయ తిరిగింది. అంతలో అక్కడే ఒక చెట్టు కింద పడుకొని ఉన్న పులినొకదాన్ని చూసింది .

పులిని చూసి అమిత అనుకుంది- "ఇది నాలానే ఉంది కదా- కాకపోతే ఇంకొంచెం లావుగా, పొడుగ్గా ఉంది. అయినా ఈ అడవిలో ఆహారం పుష్కలంగా దొరుకుతోంది; కాబట్టి ఇక్కడ ఉంటే నేనైనా అలాగే తయారయ్యేదాన్ని, దానిదేముంది?!" అని.

అడవిలో తిరిగే చిన్న చిన్న జంతువులు పులిని చూసి భయంతో పక్కకి వెళ్లడాన్ని గమనించింది అమిత. అదే వాటికి తను ఎదురుపడితే మటుకు, పట్టించుకోకుండా వెళ్ళిపోయాయి.

అప్పుడు అమిత అనుకుంది "నాలాగే ఉన్న పులికి అడవిలో ఎంత గౌరవం,మర్యాద లభిస్తున్నాయో చూడు! నాకు కాకపోతే పోనీ- కనీసం నా పిల్లలకైనా అంతటి మర్యాదలు జరగాలి" అని.

అట్లా అనుకుని అది గబగబా ఇంటికి వచ్చి, తన చిన్న పిల్లి కూనను తీసుకెళ్ళి, మెల్లగా పులి పిల్లల దగ్గర వదిలి వచ్చింది.

పిల్లి కూనను కూడా తన పిల్లే అనుకుని, పాలు ఇచ్చి జాగ్రత్తగా చూసుకొంది పులి. ఆ పిల్లి కూన కూడా మిగతా పులి పిల్లలతో ఆడుకుంటూ ఆనందంగా ఉంది.

అమిత రోజూ అడవికి వచ్చి దూరం నుండి గమనించేది: తన పిల్ల ఇప్పుడు పులిపిల్లలతో సమానంగా పెరుగుతున్నది. 'అది కూడా పెరిగి పెద్దయ్యాక పులి లాగా ఉంటుంది. తన లాగా భయపడుతూ బ్రతికే అవసరం దానికి లేదు!' అని సంతోషించేది.



ఒక రోజు పులి పిల్లలన్నీ సరదాగా ఆడుకోవడానికి వెళ్ళాయి. వాటితో బాటే పిల్లి పిల్ల కూడావెళ్ళింది. అమిత కూడా వచ్చి దూరంగా నక్కి కూర్చొని, పులి పిల్లలతో

ఆడుకుంటున్న తన పిల్లని చూసి మురిసిపోతున్నది. అంతలో అకస్మాత్తుగా అక్కడికి కొన్ని సింహం పిల్లలు వచ్చాయి . వాటిని చూడగానే పిల్లి పిల్లకు చాలా భయం వేసింది. పరుగెత్తి పారిపోబోయిందది. అయితే దానితో పాటు ఉన్న పులి పిల్లలు మటుకు "ఏయ్! ఇవి సింహం పిల్లలు! మన బంధువులే , భయమెందుకు ?" అని దాన్ని వెళ్లనీయలేదు.

అంతలోనే సింహం పిల్లల్లో ఒకటి పిల్లిపిల్లని గుర్తుపట్టి, ఎగిరి వచ్చి దానిమీదకు పంజా విసిరింది . ఆ ఒక్క దెబ్బకే పిల్లిపిల్ల కాస్తా చనిపోయింది. 'ఇదేంటి?' అని నిర్ఘాంతపోయిన పులిపిల్లలు కూడా ఆ వెంటనే 'తమతో ఉన్నది పిల్లి' అని తెలుసుకొని ఊరుకున్నాయి. ఎవరో మోసం చేసి పిల్లిని తెచ్చి తమ దగ్గర వదిలి వెళ్ళారని, వాళ్ళ దురాశకు తగిన ప్రతి ఫలం దొరికిందని అనుకున్నాయి.

ఇదంతా గమనిస్తున్న అమితకు అంతులేని దు:ఖం కలిగింది. 'తన పిల్లను పిల్లి లాగానే బ్రతకనిచ్చి ఉంటే ఆనందంగా ఉండేది కదా, తన దురాశకు మూల్యం అది చెల్లించాల్సి వచ్చింది, అనవసరంగా చనిపోయిందే!' అని బాధపడింది . తల్లి తండ్రులు తమ ఇష్టాలను, ఆశలను బలవంతంగా పిల్లలపై రుద్దకూడదని ఆలస్యంగా గ్రహించిందది.

నవ్వు!

ఆలిండియా రేడియో!

కస్టమర్: జపాన్ రేడియో అని చెప్పి ఇండియా రేడియో అంటగడతావా, నాకు? నీ మీద కేసు పెడతాను చూడు!

సేల్స్ మ్యాన్: లేదు సార్! అది జపాన్ తయారీదే. దానిమీద కంపెనీవారి లేబుల్ కూడా ఉంది చూడండి.

కస్టమర్: ఏంటి చూసుకునేది? అది అంత చక్కగా చెబుతుంటేను- 'దిస్ ఈజ్ ఆలిండియా రేడియో' అని!

రాముచేసినతప్పు

బొమ్మలకథ

చిత్రాలు: అడవి రాముడు *కథ: రాధమండువ*



రోడ్డు మీద తలొంచుకుని నడిచి పోతున్న రాముని చూసింది బుజ్జి కుక్కపిల్ల.

"రామూ! రామూ! ఎక్కడికి వెళుతున్నావు?" అంది వాడి వెంట పడి.

"నేను అలిగి తోటకి వెళుతున్నా" అన్నాడు రాము.

"అలిగావా? ఎందుకు? ఎవరేమన్నారు? అంది కుక్కపిల్ల.



సమాధానం చెప్పకుండా "ఊ! ఊ!" అంటూ పెద్దగా ఏడుస్తూ ముందుకి నడిచాడు వాడు.

"అయ్యో! ఏడవొద్దు రామూ! ఏడవొద్దు" అంటూ రాము వెనకాలే నడవసాగింది అది కూడా 'కుయ్ కుయ్' మని మూలుగుతూ.

కొంత దూరం వెళ్ళేటప్పటికి వీళ్ళకి కాకి ఎదురు వచ్చింది. రాము ఏడవడం చూసి కుక్కపిల్లకి దగ్గరగా వాలి-

" ఏమయింది? ఎందుకు ఏడుస్తున్నాడు ?" అంది.

"రాము అలిగి తోటకి వెళుతున్నాడు. ఎందుకు ఏడుస్తున్నాడో చెప్పలా" అంది కుక్క, గుసగుసగా.

కాకి ఏమీ మాట్లాడకుండా దిగులుగా చూస్తూ ఎగరసాగింది.



ఇంకొంత దూరం వెళ్ళేప్పటికి వీళ్ళకి పిల్లి ఎదురు వచ్చింది. ఏడుస్తున్న రాముని చూసి "అయ్యో! రామూ! ఎందుకు ఏడుస్తున్నావు?" అంది పెద్దగా కంగారు గొంతుతో. రాము సమాధానం చెప్పలేదు. అదసలే వాగుడు పిల్లి. నోరు మూసుకుని ఉంటుందా? కుక్కపిల్ల వైపు తిరిగి "నువ్వయినా చెప్పు. రాము ఎందుకు ఏడుస్తున్నాడు? ఎక్కడికెళుతున్నాడు?" అని అడిగింది.

" అలిగి తోటకెళుతున్నాడు" అంది కుక్కపిల్ల చిన్నగా.

" ఎవరి మీద అలిగాడు? ఎందుకు అలిగాడు? నువ్వేమైనా అన్నావా? " అంది అరుస్తూ.

అది విన్న రాము ఇంకా పెద్దగా ఏడవసాగాడు.

" ష్! అబ్బబ్బ! ఈ వాగుడు పిల్లికి ఎప్పుడు ఏం మాట్లాడాలో తెలియదు. నోరు మూసుకో" అంది కాకి.



పిల్లి నోరు మూసుకుని రాము ముందుకి వచ్చి నడవసాగింది.

నలుగురూ తోట దగ్గరకి వచ్చారు. తోట బయట మామిడి చెట్టు మీద ఉన్న కోతి వీళ్ళను చూసి క్రిందికి దూకింది. రాము ఏడుపు ఆపి దాని వైపు చూశాడు.

"రాము ఎందుకు ఏడుస్తున్నాడు?" అంటూ పిల్లి వైపు చూసి, "ఈ వాగుడు పిల్లి ఏదో అని ఉంటుంది- అంతేనా?" అంది కోతి - నడుము మీద చెయ్యి పెట్టుకుని పిల్లిని చూస్తూ. ఆ మాటలు విన్న రాము మళ్ళీ ఏడుపు లంకించుకున్నాడు.



"మీ ఇద్దరూ ఇక్కడే తన్నుకుంటూ కూర్చోండి" అంటూ కుక్కపిల్ల రాము దగ్గరకి పరిగెత్తింది. కాకి కూడా విసుక్కుంటూ రాము దగ్గరకి ఎగిరింది. కోతీ, పిల్లీ నోళ్ళు మూసుకుని వారి వెంట తోటలోకి నడిచాయి.

జామ చెట్టు మీద ఉన్న రామచిలుక రాము ఏడవడం చూసి ఒక జామ పండుని తెచ్చి రాముకి ఇచ్చింది. రాము ఏడుపు ఆపి చెట్టుకింద కూర్చుని జామపండు తినసాగాడు. అన్నీ రాము చుట్టూ కూర్చున్నాయి.

అంతలో "రామూ! రామూ!" శీతల పెద్దగా కేకేస్తూ తోటలోకి వచ్చింది.

రామచిలుక శీతలకి కూడా జామపండు ఇస్తూ "ఎందుకు, రాము ఏడుస్తున్నాడు?" అంది.

"మరే! రాము పక్కింట్లో ఆడుకోవడానికి వెళ్ళి వాళ్ళకి తెలియకుండా వాళ్ళ బంతి ఎత్తుకొచ్చాడు. అందుకని అమ్మ కొట్టింది" అంది శీతల.

"అమ్మో! దొంగతనం చేశావా?!" అంది వాగుడు పిల్లి.

"తప్పు కదూ!?" అంది కోతి.

రాము ఈసారి ఇంకా పెద్దగా వెక్కి వెక్కి ఏడవసాగాడు.

"ష్! అలా మాట్లాడకూడదు. మూడేళ్ళ బాబుకేం తెలుస్తుంది?! తెలియక చేసి ఉంటాడు-ఊరుకో!" అంది కుక్కపిల్ల.

"ఇంకెప్పుడూ అలా చేయడు! " అంది కాకి.

"ఏడవొద్దు రామూ. ఇంకొకరి వస్తువులు వాళ్ళకి తెలియకుండా తీసుకోకూడదని ఇప్పుడు తెలిసిందిగా., దా ఇంటికి పోదాం. ఇంకెప్పుడూ అలా చేయనని అమ్మతో చెబుదువుగాని దా!" అంది శీతల, తమ్ముడి భుజాన్ని పట్టి లేపుతూ.

రాము, శీతలతో కలిసి అన్నీ ఇంటికి వచ్చాయి.

"ఇంకెప్పుడూ ఇంకొకరి వస్తువులు తీసుకోనమ్మా!" అన్నాడు రాము అమ్మ మీదికి ఎక్కేసి ఏడుస్తూ.

అమ్మ రాముని ఎత్తుకుని, వాడి కళ్ళు తుడిచి ముద్దు పెట్టుకుంది.

చిలిపి ప్రశ్నలు -తిక్క జవాబులు

నిర్వహణ: శ్రీవి.వి.యస్.మూర్తి, చొదిమెళ్ళ.

1. 12 నుంచి 2 తీసేస్తే ఎంత మిగులుతుంది?

జవాబు: ఒకటి

2. నిద్రలేవగానే మొదట చేసే పని ఏది?

జవాబు: కళ్ళు తెరవడం!

3. ప్రపంచంలోని ప్రజలంతా ఎక్కువగా ఏబాష మాట్లాడతారు?

జవాబు: తమమాతృబాష!

4. మగవాళ్ళందరూ తల దించుకునేది ఎప్పుడు?

జవాబు: క్షవరం చేయించుకునేటప్పుడు!

5. పసిఫిక్‌సముద్రం మధ్యలో ఏముంటుంది?

జవాబు: జలం!

6. గందరగోళపు వాస్తుసిద్ధాంతి ఏమంటాడు?


జవాబు: ఇల్లుపీకి పందిరెయ్యమంటాడు!

7. వారానికోసారి బంద్ జరిగితే ఏమవుతుంది?

జవాబు: పెట్రోలు మిగిలిపోతుంది; వాతావరణ కాలుష్యం తగ్గుతుంది!

సమీక్ష

కొత్తపల్లి కథల పుస్తకం-60 పై ఒక సమీక్ష   *సమీక్షకులు: రాజా పిడూరి*



ఈ సారి కొత్తపల్లిలో అన్ని కథలూ బాగుండి చదివించాయి. కొన్ని కథలు సాదాగానే మొదలయినా చివర్లో మాత్రం మెరిసాయి. 'బురద' కథలో - దొంగతనం అంటకట్టడానికి ముందు తానే దొంగగా మారడం; బురద చల్లడానికి ముందు తన చేతులకు బురద అంటడం - దీన్నే మనసుకి అంటిన బురదగా చెప్పడం - చాలా బావుంది. అలానే 'చిలుక తెలివి' తెలిసిన కథే అనుకుంటూ చదివినా ముగింపు కొంచెం కొత్తగానే ఉంది. 'తోటమాలి తెలివి' లో అసలు మొక్కని కనిపెట్టే ఉపాయం అటుంచి చివర్లో తోటమాలి మొక్కకి నీళ్ళు పోయడం హృద్యంగా ఉంది. ఈ చివరి వాక్యం వల్ల కథకు ఎంతో నిండుదనం వచ్చింది. కలగా తేలిపోవడం అనే ముగింపు పాతదే అయినా మంచి విషయాలను చక్కగా చెప్పిన కథలు - 'మారిన వేటగాడు', 'పగటి కలలు'.

జంతువుల పట్ల ప్రేమను చూపించడం ఎంత ముఖ్యమో 'కుందేలును కాపాడిన రాజేష్' (బొమ్మకి వ్రాసిన) కథ తెలిపింది. అర్థం చేసుకోగలిగితే పావురాలు కూడా మత సామరస్యాన్ని బోధించగలవని వివరించింది 'పావురం చెప్పిన పాఠం' కథ. కథలో చివర్లో చెప్పిన నీతితో పాటు ప్రకృతిలో ఉన్న ఆహారపు చక్రంలో మనిషి స్థానాన్ని చెప్పకనే పరోక్షంగా చెప్పినట్లుంది 'పొంచి ఉన్న ప్రమాదం' కథ.

చిట్టి పొట్టి బొమ్మల కథ 'రాజు బడికి వెళ్ళాడు' బాగుంది. ప్రతినెలా ఇలాంటి చిట్టి బొమ్మల కథలు కనీసం ఒకటైనా ఉంటే బావుంటుంది. (ఈ సంచికలో రెండున్నాయి!) మనసునీ శరీరాన్నీ అదుపులో ఉంచడం యొక్క ప్రాముఖ్యాన్ని 'అనువైన విద్య' కథ చెప్తే, సైన్స్ సహాయంతో కొందరు మూఢనమ్మకాలను ఎలా ప్రోది చేస్తారో చక్కగా వివరించింది 'రక్తం త్రాగే దేవత' కథ. సౌందర్యం అశాశ్వతం అని ఎన్నోసార్లు ఎన్నో

కథలలో చదివిన విషయాన్ని నూతనంగా చెప్పింది 'రాజ కుమారుని సౌందర్యం' కథ. 'నీతి చంద్రిక'లో కథనం సరళంగా, సూటిగా, హత్తుకునేలా ఉంది. అలాగే 'విధి వ్రాత' లోని కథనం కూడా.

ఈ సంచిక లోపలి బొమ్మలు అన్నీ బానే ఉన్నాయి. ముఖ్యంగా 'నీతి చంద్రిక'లో ముసలి కాకి గుడ్లగూబకి తన కథని విన్పిస్తూ - మిగతా కాకులన్నీ తనని బాధ పెట్టిన విషయాన్ని సూచిస్తూ వేసిన బొమ్మలో నేపధ్యంగా పెద్ద కాకిని వెయ్యడం చాలా మంచి ఆలోచన. కానీ 'మారిన వేటగాడు' లో సీతమ్మనూ, 'తోటమాలి తెలివి'లో కళాకారుణ్ణీ ఇంకొంచెం శ్రద్ధగా వేస్తే బాగుండేదనిపించింది. ముఖచిత్రం కొంచెం నిరాశ పరచిందనే చెప్పాలి. బహుశా ప్రతినెలా ముఖచిత్రంలో ఎంతో ఆశించి ఆతృతగా ఎదురు చూడడం వల్లనేమో!

చిట్టి గేయం - ఉగాదీ, చిట్టి బొమ్మా అలరించాయి. నవ్వ్వాసులు (జోక్స్) దాదాపు అన్నీ కొత్తగానే ఉండి బాగా నవ్వించాయి. చిలిపి ప్రశ్నలు తమాషాగా ఉంటే, యువ కెరటాలు స్ఫూర్తి దాయకంగా ఉంది. 'చిన్న చిన్న పిల్లలం' గేయంలో వేసిన ఛాయా చిత్రాలు స్ఫుటంగా, హృద్యంగా ఉన్నాయి. ఇంత మంచి కాగితం మీద ఇంత చక్కటి ప్రమాణాలతో ముద్రిస్తున్న 'ముద్రిక' వారికీ, కొత్తపల్లి జట్టుకీ అభినందనలు.

ఇవి గమనించారా, పెద్దలూ-కొంచెంకొంచెంగా పెద్దవుతూ తెలుగు బాగా చదువుకుంటున్న పిల్లలూ? :

సంపాదకీయం లో వ్యవస్థ అనే మాటని 'యవత్స' అంటున్నాడు రంగయ్య తాత. 'త' కి 'స' వత్తుని తిరగవేసినట్టుగా పలకడం కొన్ని ప్రాంతాల్లో వినవచ్చు - చురుకైన చెవితో ఆలకిస్తే. 'వస్తా' అనే మాట 'వత్సా' లాగా వినిపిస్తుందేమో గమనించండి ఎక్కడైనా!

ఈ సంచికలోని కథల్లో 'ప్రావీణ్యత', 'ప్రాధాన్యత' అనే మాటలు గమనించారా? వీటి బదులు 'ప్రావీణ్యం', 'ప్రాధాన్యం' అనే మాటలు వాడినా ఆ వాక్యాలు చక్కగా అర్థమౌతాయి (ప్రయత్నించి చూడండి). ఇట్లా అనవసరంగా 'త' లు ఎందుకు కొన్ని మాటల చివర 'త'గులు కున్నాయో ఎప్పుడైనా ఆలోచించారా?

ముద్రిత ప్రతుల వెల: ప్రతి ఒక్కొంటికి: 25 రూ.
12 పుస్తకాలకైచందా: **రూ. 300/-**

"కొత్తపల్లి ట్రస్టు" పేరిట యంవో/డిడిని ఈ చిరునామాకు పంపండి: కొత్తపల్లి ట్రస్టు, యంఆర్‌వో ఆఫీసు దగ్గర, చెన్నేకొత్తపల్లి, అనంతపురం జిల్లా- 515101, ఆంధ్రప్రదేశ్.

బ్యాంకు అక్కౌంటు వివరాలు:

"Kottapalli Trust", A/c No. 0138101018809 (savings), Canara Bank, Chennekothapalli. IFSC: CNRB0000138

ఫోన్లు: 08559 240222, 7702877670
ఇ-మెయిలు: team@kottapalli.in

ఈ నెలలో ఏపని-ఎవరిది?

ఆర్థిక వ్యవహారాలు, నిర్వహణ: సుబ్బరాజు
సంపాదకత్వం: నారాయణ
వెబ్సైటు, సాంకేతికత: ఆనంద్, లక్ష్మి
ముద్రణ: 'ముద్రిక' కృపాకరరావు
ముఖచిత్రం : వీరాంజనేయులు
చిత్రాలు: అడవి, ప్రసాద్, చంద్రకాంత్, లక్ష్మీవెంకట్, రామకృష్ణ, మహేష్.
జోకులు: ద్విజేంద్ర- యనమదల, గుంటూరు
కథలు, పాటలు: చాలామంది పిల్లలు

ప్రత్యేక కృతజ్ఞతలు: ప్రజ్ఞ-అద్దంకివారికి, ప్రభుత్వ ప్రాథమిక-ప్రాథమికోన్నత పాఠశాలలు- తరాలపల్లి వారికి, మ్యాజిక్ కథల రావు గారికి, రాధా రాజశేఖర్ గార్లకి, , చిలిపిప్రశ్నలమూర్తిగారికి, కంప్యూటర్లలో లైనక్సు వ్యవస్థను చక్కగా అందిస్తున్న ఉబుంటు వారికి, జింప్, అడాసిటీ తదితర ఓపెన్ సోర్సు సాఫ్టువేరు నిర్మాతలకు, ఇంకా పేర్లు రాయని అనేకమందికి.

పిల్లల్లో సృజనాత్మకత సహజం. కథలు, ఆటలు, పాటలు, బొమ్మలు దానికి ఊతాన్నిస్తాయి. మాతృభాషలో ఇష్టంగా చదవటం, తేలికగా రాయటం వస్తే అటుపైన అన్ని శాస్త్రాలూ సులభంగా వంటపట్టుతాయి-నిజం! అందుకని మీ పిల్లల్లో ఉన్న కాల్పనిక శక్తికి పదును పెట్టండి. వాళ్లను కథలు రాసేందుకు, పాటలు పాడేందుకు, బొమ్మలు వేసేందుకు ప్రోత్సహించండి. వాళ్ళ రచనల్ని మాకు పంపండి. కావాలనిపిస్తే మీరే ఇలాంటి పత్రికనొకదాన్ని మొదలుపెట్టండి- ఎలాగైనా సరే- పిల్లలు పెద్దవాళ్లయ్యేలోగా వాళ్ళు చాలా చాలా తెలుగు కథల్ని చదివేలా, రాసేలా చేయండి. మీ పిల్లలకు ఈ పత్రికలోని కథలు నచ్చుతాయనే మా నమ్మకం- వీటిని వీలైనంత మందితో పంచుకోండి. మీరు రాసిన పిల్లల కథలు ఏమైనా ఉంటే పనిగట్టుకునైనా సరే, మాకు పంపండి. వీలు చేసుకొని ప్రచురిస్తాం.

మంచి పుస్తకం:

మల్లెపూదండ

(తెలుగు కవిత కథ)

-బొమ్మకంటి శ్రీనివాసాచార్యులు.

"అబ్బ శ్రీనాధుడు ఎంత గొప్పవాడో!"

"అబ్బ పోతన కవిత్వం ఎంత తీపో!"

"అష్టదిగ్గజాలు చాలా గొప్పకవులు!

"కందుకూరి వీరేశలింగం చాలా గొప్ప రచనలు చేశాడు!"


"శ్రీశ్రీ కవితలు ఆధునిక కవిత్వానికి కొక ఒరవడినిచ్చాయి!"

ఇలాంటి మెచ్చుకోలు మాటలు ఎన్నో చెబుతాం, మన పిల్లలకు. కానీ శ్రీనాధుడి పద్యాన్ని గానీ, పోతన కథని గాని, భువన విజయ గాథని గాని, వీరేశలింగం రచనాశైలిని గానీ, ఆధునిక పదకవితను గానీ ఎన్నింటిని "ఔరా!" అనిపించేలాగా పిల్లలకు అందిస్తున్నాం?!

కవిత్వపు చరిత్రను బండగా, మొండిగా - 'అబ్బ! ఇక చాలు బాబూ!' అనిపించేలా కాక, 'ఓహో! ఇదా, నేను చదువుతున్న పద్యం వెనకాల ఉన్నది! ఇదా, నా వారసత్వ సంపద!?' అని ఆశ్చర్యాన్ని రేకెత్తించి ఇష్టం పెంచేలా చెప్పే పుస్తకాల్లో మొదట నిలుస్తుంది ఈ పుస్తకం.

నన్నయ, పోతన, వేమన, విశ్వనాధులనుండి శ్రీశ్రీ వరకూ- ఒక్కొక్కరినీ కథలాగా, మనలాంటి మనుషుల లాగా, మరెవరో దివ్యకవితా మూర్తులలాగా కళ్లముందు కదలాడేట్టు చేస్తుందిది!

పదిహేను - పదహారేళ్ల పిల్లలు ఇష్టంగాను, సులభంగాను చదవగల్గే యీ పుస్తకం, చాలా బాగుంది!




మల్లె పూదండ

(తెలుగు కవిత కథ)

ఆం.ప్ర. బాలల అకాడమి (1999)

పేజీలు: 144

వెల: రూ. 12



అయ్యో ! తెలుగు రాదే, ఎలాగ?!

"కథలమ్మా కథలు! కథలమ్మా కథలు! రకరకాల కథలు! తెలుగుపిల్లల కథలు!"

"ఏం కథలు బాబూ? మాపిల్లలకు తెలుగు చదవటం రాదు. ఇంగ్లీషు కథలు ఏమన్నా ఉన్నాయా, నీ దగ్గర?"

"ఇంగ్లీషువైతే వేరేవాళ్ళ దగ్గర దొరుకుతాయండి. నా దగ్గర ఉన్న సరుకంతా తెలుగువాళ్లకోసమే. ఏం, మీ పిల్లలు తెలుగువాళ్ళు కారాండీ? పాపం, వాళ్ళకి కొంచెం తెలుగు నేర్పించకపోయారూ?"

"ఏమో నాయనా! మా వాళ్లకైతే ఇంగ్లీషు అంటేనే ఇష్టం. ఆ ఇంగ్లీషు నేర్చుకునేసరికే వాళ్ల తల ప్రాణం తోకకొచ్చింది. ఇంక తెలుగు ఎక్కడ నేర్చుకుంటారు?"

"అవున్లెండి, పాపం. కానీ నా దగ్గర ఉన్నవి తెలుగు కథలేనండి. మీకు పనికిరావు."

"ఏదీ, ఓసారి చూడనియ్యి- పుస్తకం బానే ఉన్నట్టుందయ్యా, కాయితం, రంగులు అదీనీ- దీన్ని పాపం ఇంగ్లీషులో అచ్చెయ్యకపోయారూ? మీకూ కొంచెం అమ్మకాలుండేవి గద! ఇప్పుడు పిల్లలంతా ఇంగ్లీషు బళ్లలో చదివీ చదివీ, తెలుగుని పూర్తిగా మరచే పోతున్నారుగా?"

"అవునండీ, అందుకనే వీటిని తెలుగులో మాత్రమే అచ్చేస్తున్నాం. మీ పిల్లలకి ఈ కథలు కావాలంటే వాళ్ళు తెలుగు నేర్చుకోవాల్సిందే, తప్పదు. లేకపోతే ఇంకో మార్గం ఉంది- మీరు వాళ్లకి చదివి పెట్టచ్చు-"

"అవున్లే, అట్లాగైనా వాళ్లకి మెల్లగా తెలుగు చదవటం వస్తుందేమో, చూస్తాను. కథలు చదవటం కోసమన్నా వాళ్ళు తెలుగు నేర్చుకుంటారేమో"

"తప్పకుండా నేర్చుకుంటారు చూడండి. అదేమంత బ్రహ్మవిద్య? తలచుకుంటే వాళ్ళు ఒక్క రోజులో నేర్చుకోగలరు. కథల్లో మాయ మీకు తెలీనిదా? మీరు చిన్నప్పుడు ఎన్ని కథల పుస్తకాలు చదవలేదు?"

"అవును నాయనా! ఇప్పుడు తెలుగు పుస్తకాలే కరువైపోతున్నాయి"

"ఏమీ లేదండీ! ఆదరించేవాళ్లు ఉంటే భాష చటుక్కున పుంజుకుంటుంది. ఏం చేసినా తెలుగులో అర్థమైనంత బాగా పరాయి భాషలో ఎంతమందికి అర్థమౌతుంది, చెప్పండి? ఏదో ఒక మాయ చెయ్యాల్సిందేనండీ. మీ పిల్లలకి 'తెలుగు రాదు' అని ఊరుకోకండి. ఏదో ఒకటి చేసి వాళ్ళ భాషని వాళ్ళకి ఇవ్వాలి- లేకపోతే కుదరదు."

"అంతేనంటావా?"

"అంతేనండీ- వేరే మార్గం లేదు. మాతృభాష తర్వాతే, వేరే ఏదైనా."

Published by Narayana for Kottapalli Trust, Near M.R.O.Office, Chennekothapalli-515101, Ananthapur District, AP.
Ph:08559 240222 E-mail: team@kottapalli.in . Printed at Mudrica Offcet Printers, Vijayawada, Phone: 0866 2579129